మానవత్వం చాటుకున్న కలెక్టర్

విశాలాంధ్ర-విజయనగరం: జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి తుఫాన్ ప్రభావిత మండలాల పర్యటనకు బయలుదేరిన సందర్భంగా గజపతినగరం సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగినట్లు గమనించారు. వెంటనే తన వాహనాన్ని ఆపించి, స్వయంగా దిగి, గాయపడిన వ్యక్తుల వద్దకు చేరుకున్నారు. బాధితుల స్థితిని తెలుసుకుని, అంబులెన్స్‌ను ఏర్పాటు చేయించి తక్షణం ఆసుపత్రికి తరలించారు. ఎక్కడైనా ప్రమాదం, అత్యవసర పరిస్థితి ఉంటే మానవతా దృష్టితో స్పందించాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. గోల్డెన్ హావర్ లో అందించిన సాయం మనిషి ప్రణాలను కాపాడుతుందని ప్రాణం కంటే విలువైనది మరేమీ లేదని అన్నారు. కలెక్టర్ యొక్క ఈ మానవతా స్పందనను చూసి అక్కడ చేరిన ప్రజలు ప్రశంసించారు. ప్రజలకు చేరువైన అధికారిగా ఆయన ప్రవర్తన మరోసారి వెలుగులోకి వచ్చింది.

జల దిగ్బంధంలో సోంపురం రైల్వే అండర్ బ్రిడ్జి

వేపాడ మండలానికి నిలిచిన రాకపోకలు

విశాలాంధ్ర-వేపాడ : మొంథా తుఫాను ప్రభావంతో జిల్లాలో అనేకచోట్ల ఇబ్బందులు ఎదురయ్యాయి. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలవల్ల వేపాడ మండల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు తెచ్చిపెడుతున్నాయి. మండలంలోని సోంపురం గ్రామం వద్ద ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి పూర్తిగా జల దిగ్బంధంలో చిక్కుకుపోవడంతో వేపాడ మండలం నుండి శృంగవరపుకోట, విజయనగరం, విశాఖపట్నం మార్గాల మధ్య రాకపోకలు పూర్తిగా స్థంభించిపోయాయి.గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వలన సోంపురం గేడ్డలోకి ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు నీరు రైల్వే అండర్ బ్రిడ్జిలోకి చేరి నీటమునిగిపోయింది. రైల్వే అధికారులు జెసిబీ సహాయంతో నీటిని తొలగించే ప్రయత్నాలు చేసినా, వాగు ప్రవాహం తగ్గకపోవడంతో పరిస్థితి యథాతథంగానే కొనసాగుతోంది. అలాగే గతంలో ఇక్కడ రైల్వే గేటు ఉండేది.అప్పట్లో రైలు వచ్చినపుడు కొంతసేపు మాత్రమే రాకపోకలకు ఆటంకం కలిగేది. కానీ ఇప్పుడు బ్రిడ్జి నిర్మాణం తర్వాత ప్రతివర్షాకాలంలోనే ఇది పెద్ద సమస్యగా మారిందిని మండల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మండల కేంద్రానికి, ఆసుపత్రులకు లేదా అత్యవసర సేవలకు వెళ్ళాల్సిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు తగ్గే వరకు ప్రజల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయే పరిస్థితి ఏర్పడింది. "ప్రజా సౌకర్యం కోసం నిర్మించిన బ్రిడ్జి, ఇప్పుడు ప్రజలకు భారంగా మారింది.ఇకనైనా రైల్వే శాఖ శాశ్వత పరిష్కారం చూపాలి." వర్షాకాలం వచ్చిందంటేనే "సోంపురం బ్రిడ్జి" జల దిగ్బంధంలో చిక్కుకోవడం ప్రతిసారీ,పునరావృతమవుతున్న సమస్యగా మారిందని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదం అంచున మల్లి నాయుడు చెరువు

- ఆందోళనలో ప్రజలు
- పరిశీలించిన ఎమ్మెల్యే బేబీ నాయన

విశాలాంధ్ర-బాడంగి: మండలం బొత్సవాన్ని వలస గ్రామానికి చెందిన మల్లినాయుడు చెరువు పూర్తిస్థాయి లో నిండిపోయి గట్టు తెగే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గ్రామ సమీపమున ఈ చెరువు ఉండడంతో ఎప్పుడు గట్టు తెగిపోయి గ్రామ శివాలయం మీద నీటి ఉధృతి పడుతుందేమో అని వారు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న బొబ్బిలి ఎమ్మెల్యే బేబీ నాయన అక్కడ కి వెళ్లి పరిశీలించారు. అధికారులను అప్రమత్తం చేసి ఇటువంటి ఇబ్బందులు ప్రజలకు కలగకుండా చూడాలని ఆదేశించారు. చెరువు గట్టు పటిష్టతకు ఇరిగేషన్ వారు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్థానిక ఎస్సై తారకేశ్వర రావు అక్కడ చేరుకుని ప్రజలను అప్రమత్తం చేశారు. రైతులెవరు చెరువు గట్టుపై తిరగవద్దని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

జల దిగ్బంధంలో భీమసింగి

- ఆక్రమణలతో ప్రమాదకరంగా చాకిరేవు చెరువు
- ముంపుకు గురైన వందలాది ఎకరాల వరిపంట
- రెల్లిపేట వాసులకు పునరావాసం ఏర్పాటు

రహదారిపై ప్రవహిస్తున్న చెరువు నీరు

విశాలాంధ్ర-జామి: మండలంలోని అన్ని గ్రామాలలో మొంథా తుఫాను ప్రభావం లేకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకున్నా, పాతభీమసింగి గ్రామం మాత్రం జలదిగ్బందంలో చిక్కుకుపోయింది. స్థానిక బస్టాండ్ వద్దనున్న చాకిరేవు చెరువులో వర్షం నీరు భారీగా చేరింది. నీటిని బైటకు పంపేం దుకు గతంలో కాలువలు ఉంటేవి. వాటి ద్వారా దిగువ ప్రాంతాలకు నీటి తరలించేవారు. కానీ పలు కాలువలు ఆక్రమణకు గురికావడంతోపాటు చెరువును సైతం ఆక్రమించడంతో చాకిరేవు చెరువులోనీరు రహదారి పైకి, పంటపొలాలపైకి దూసుకు వస్తోంది. చెరువునీరు దాటికి బస్టాండ్‌లో రహదారులు నీట ముని గాయి. ప్రయా ణీకులు, వాహనదారుల తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారు. అలాగే పంటపొలాలన్నీ నీటిముంపు లో చిక్కుకు పోయాయి. చేతికందిన వరి పంట నీట మునగడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

పునరావాసానికి రెల్లిపేట వాసులు తరలింపు..

గ్రామంలోని రెల్లిపేటలోకి వర్షం నీరు ప్రవహించడంతోపాటు గోస్తనీ నది ఒడ్డున పాకలు ఉండడంతో ప్రమాదకరంగా భావించి కాలనీ వాసులను వెంటనే అక్కడనుంచి స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పునరావాసం ఏర్పాటు చేసారు. వారికి అవసరమైన భోజన ఏర్పాట్లు చేసారు. రెల్లిపేట వాసులను స్థానిక మండల వైసీపీ అధ్యక్షుడు గొర్లె రవికుమార్, గ్రామ సర్పంచ్ ప్రతినిధి జొన్నాడ సత్యంనాయుడు, మజ్జి హరికృష్ణలు పరామర్శించి వారిని పునరావాసానికి తరలించడం జరిగింది. అలాగే భీమసింగి వంతెన పైనుంచి గోస్తనీనది ప్రవహించడంతో వంతెనపైనుంచి జన్నివలస, వెంకటరాజుపాలెం, వెన్నె, శాసనాపల్లి, సోమయాజులపాలెం, కంది శ్రీరాంపురం గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి.

రెల్లిపేట వాసులతో మాట్లాడుతున్న వైసీపీ నేతలు

చంపావతి నది వద్ద ఉధృతి

విశాలాంధ్ర-గుర్ల: తుఫాన్ ప్రభావతంతో కురుస్తున్న భారీ వర్షాలకు ఆనందపురం చంపావతి నదీ ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో మండలంలో భూపాలపురం, నడుపూరు, చింతలపేట, గరికవలస గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. ప్రస్తుతం చంపావతి నది వంతెనపై ట్రాఫిక్ నిలిపివేయగా. పరిసర ప్రాంతాల్లో పోలీసులు, రెవిన్యూ సిబ్బంది నిఘా ఉంచారు.

తుఫాన్ నష్టాలను తక్షణమే పంపాలి

- మత్స్యకారులకు ప్రభుత్వం ప్రకటించిన సహాయం వెంటనే అందజేయాలి
- తుఫాన్ లో సమర్ధవంతంగా పనిచేసిన అధికారులకు, సచివాలయ సిబ్బందికి కలెక్టర్ అభినందనలు

విశాలాంధ్ర-విజయనగరం: తుఫాన్ వల్ల ఏర్పడ్డ నష్టాలను వెంటనే పంపాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి అధికారులకు ఆదేశించారు. శాఖల వారీగా జరిగిన నష్టాలను తెలియజేస్తూ వాటి పునరుద్ధరణకు అయ్యే ఖర్చు అంచనాలను కూడా బుధవారం సాయంత్రం లోగానే పంపాలని తెలిపారు. నష్టాల అంచనాలు ఖచ్చితంగా ఉండాలని, ప్రత్యక్షంగా చూసి రాయాలని, వాటి ఫోటోల తో సహా పంపాలని తెలిపారు. బుధవారం కలెక్టర్ జిల్లా అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వారీగా అన్ని శాఖలకు సంబంధించిన నష్టాల పై ఆరా తీశారు. తాత్కాలిక పునరుద్ధరణ పనులు వెంటనే చేపట్టాలని, శాశ్వత పనులకోసం అంచనాలను తయారు చేసి పంపాలని అన్నారు. వేటకు వెళ్ళని కారణం గా ఉపాధి కోల్పోయిన మత్స్యకారులకు ప్రభుత్వం ప్రకటించిన 50 కేజీల బియ్యం వెంటనే అందించాలని మత్స్య శాఖ అధికారులకు సూచించారు. నిబంధనల మేరకు వాస్తవ లబ్దిదారుల జాబితాను సిద్ధం చేయాలని, సంయుక్త కలెక్టర్ తో చర్చించి పంపిణీ వెంటనే జరిగేలా చూడాలని అన్నారు. తుఫాన్ లో నిరంతరంగా క్షేత్ర స్థాయి లో తిరుగుతూ, సమర్ధవంతంగా జిల్లా అధికారులు, సచివాలయ సిబ్బంది 24/7 పని చేసారని, వారి సేవలు ఆమోఘమని, వారందరినీ జిల్లా కలెక్టర్ అభినందించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా మన సేవల పట్ల సంతృప్తి చెంది అభినందించారని కలెక్టర్ తెలిపారు. ఇదే స్ఫూర్తి తో ఇంకో రెండు రోజులు పని చేయవలసి ఉంటుంది, ఏ ఒక్కరూ రిలాక్స్ కావద్దని తెలిపారు.

నీటమునిగిన పశువుల పాకలు

- పాడిరైతులు అవస్థలు -మెకానిక్ షెడ్‌లలో పశువులు
- శాశ్వత పరిష్కారానికై జిల్లా కౌలు రైతు సంఘం కార్యదర్శి రాకోటి డిమాండ్

విశాలాంధ్ర-మెంటాడ: మొంథా తుఫాన్ ప్రభావంతో మెంటాడ మండలం లో భారీ వర్షాలు కురవడంతో ఆంధ్ర రిజర్వాయర్ లో నీటిమట్టం పెరగడంతో ఇరిగేషన్ విభాగం అధికారులు సుమారు 5000 క్యూసెక్కుల నీటిని చంపావతి నదిలోకి విడుదల చేశారు.దీని ఫలితంగాచంపావతి నదికి అవతలవున్న పశువులను నదీ ప్రవాహానికి పాడిరైతులు వెళ్లలేక మెంటాడ గ్రామ పరిసరాల్లోని పాడి పశువులను మెకానిక్ షెడ్లులోపల, స్కూల్ ఆవరణలో పశువులను సంరక్షిస్తున్నారు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, ముంపు కారణం గా పశువుల షెడ్లు దెబ్బతిన్నాయని, రైతులు తాత్కాలికంగా ఇతర ప్రాంతాల్లో పశువులను కట్టుకోవడం జరుగుతోందని తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ కస్తూరిబాయి బాలికల వసతి గృహం కూడా వరదనీటితో ప్రభావితమైందని, ముందస్తు జాగ్రత్త చర్యలుగా మండల అధికారులు ఆదేశాల మేరకు 208 మంది విద్యార్థినులను రాత్రికి రాత్రే మెంటాడ ప్రభుత్వ హై స్కూల్‌కు తరలించడం జరిగింది. ఈ ఘటనపై స్పందించిన జిల్లా కౌలు రైతు సంఘం కార్యదర్శి రాకోటి రాములు మాట్లాడుతూ, "ఇటువంటి పరిస్థితులు మరల పునరావృతం కాకుండా అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలి. చంపావతి నది ఒడ్డున సమీపంలో ఉన్న కస్తూరిబాయి బాలికల వసతి గృహానికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలనిపలువురు కోరుతున్నారు.

తుఫాన్ ప్రభావానికి గంగన్నపాడు గ్రామ విధుల్లో ప్రవహిస్తున్న వరద నీరు

పరిశీలీస్తున్న ఎమ్మెల్యే

విశాలాంధ్ర-తెర్లాం: మండలం లో మెంతా తుఫాను ప్రభావం వలన కురిసిన భారీ వర్షానికి గంగన్నపాడు గ్రామ వీధుల్లో వరద చేరి పొంగి ప్రవహిస్తుం డడంతో బయటకు రాలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విష్యం తెలుసుకున్న బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్ వి ఎస్ కే కే రంగారావు (బేబీనయన)బుధవారం ఆ గ్రామం చేరుకొని పరిశీలిం చారు. తనతో పాటు తెర్లాం తహసీల్దార్ హేమంత్ కుమార్, ఎండిఓ ఆర్.రాంబాబు పాల్గొన్నారు. అది కారుల తో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి నష్టం జరగకుండా చూడాలని అధికారులకు సూచించారు.

వరికి అపార నష్టం

- మండలంలో 29 గ్రామాల్లో, 117 మంది రైతుల 160.7 ఎకరాల వరి పంట నేలమట్టం

విశాలాంధ్ర -మెరకముడిదాం: ఇటీవల రెండు రోజుల నుండి మొంథాన్ తుఫాను ప్రభావంతో ఎడ తెరిపిలేని కురుస్తున్న వర్షాలు, గాలుల ప్రభావంతో మండలంలో 160.7 ఎకరాల వరి పంట నేలమట్టమయింది. మండల రెవెన్యూ తహసిల్దార్ ఆకుల సులోచన రాణి మరియు మండల వ్యవసాయ అధికారిని ఎ. శ్రావణి తేజ ఇచ్చిన వివరాల ప్రాప్తికి వారి ప్రాథమిక అంచనా ప్రకారం మండలంలో 29 గ్రామాల్లో 117 మంది రైతులకు సంబంధించిన 160.7ఎకరాల వరి పంట నేలకొరిగింది. వ్యవసాయ అధికారిని శ్రావణి తేజ, మండల రెవెన్యూ తాసిల్దార్ ఆకుల సులోచన రాణి ఇచ్చిన వివరాల ప్రకారం సంబంధిత ఆర్.బి.కె పరిధిలో వి ఏ ఏ లు ఇచ్చిన సమాచార ప్రాప్తికి మండలంలో 29గ్రామాల్లో వరి పంటకు అపారమైన నష్టం వాటిల్లినట్టు ఆమె వెల్లడించారు. ఆమె చెప్పిన వివరాలు ప్రకారం మెరకముడిదాం లో 4 ఎకరాలు, బుధ రాయవలస 5, గర్భాం 17, గొల్లలవలస 8, గాతాడ 28, గరుగుబిల్లి 9, చిన్న బంటుపల్లి 3.5, వాసుదేవపురం 1.5, సింగవరం 0.4, శివంద్ర వలస మరియు జి మర్రి వలస 2 ఎకరాలు, భీమవరం 9, శాతం వలస 5, రాచ గుమడాం 5, ఊ టపిల్లి 5, పూతికి వలస 4.2, దశమంతపురం 0.8, శ్యామయ్య వలస 2 ఎకరాలు, గొ ట్టిపల్లి 2, ఇప్పలవలస 0.3, బిలల వలస 4.4, కొండ లావేరు 5, బాడాం 8, భగీరథపురం 8, యాడికి 6, సిరిదేవపురం 5, ఎం రా ఇవలస 7 ఎకరాల విస్తీర్ణంలో మొత్తం 160.7 ఎకరాల వరి పంటకు నష్టం వాటిల్లినట్లు తెలిపారు.

ఓ పక్క తుఫాను... మరోపక్క డోలిమోత

విశాలాంధ్ర-శృంగవరపుకోట రూరల్ : మండలంలోని మూల బొడ్డవర పంచాయతీ శివారు చిట్టంపాడు గ్రామానికి చెందిన జర్నీ అంజలి అనే బాలికకు జ్వరం తీవ్రమవడంతో డోలితో వర్షంతోనే కొండ దిగువకు తీసుకువచ్చి అక్కడ నుంచి పట్టణంలో ఆసుపత్రికి తరలించామన్నారు. ఎక్కడో ఒకచోట గిరిజన గ్రామాలలో రోడ్డు వేసినంతమాత్రాన గిరిజన గ్రామాలు అన్నీ బాగు పడినట్లు చెప్పుకుంటున్న ప్రభుత్వం మండలంలోని గిరిజనుల బాధలు చూడాలని, ఎమ్మెల్యే మాజీ ఎమ్మెల్యేలు కూడా హామీలు ఇచ్చి రోడ్డు నిర్మాణం చేపట్టలేదని ఆదివాసి గిరిజన సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.

తుఫాను బాధితులకి ఎమ్మెల్సీ సాయం



విశాలాంధ్ర- శృంగవరపు కోట: మొంతా తుఫాను బాధితులను ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు బుధవారం పరామర్శించారు. సహాయక చర్యల్లో భాగంగా నిత్యావసర సరుకులను ,బొడ్డపాడు, లక్ష్మీపురం, సెనగపాడు, గదిలోవ లో కూరగాయలు ,రైస్, పప్పు, మొదలగు నిత్యావసర సరుకులు అందించారు. మెట్టపాలెం, మూలబొడ్డవర రిలీఫ్ కాంప్ లలో పిల్లలను సంద ర్శించి వాళ్ళకి కావాల్సిన ఏర్పాట్లు చేసారు. బాధితులను అన్ని రకాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

తుఫాను కారణంగా పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి : సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ



విశాలాంధ్ర-విజయనగరం టౌన్: మొంథా తుఫాను కారణంగా మూడు రోజుల కురిసిన వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గత మూడు రోజులుగా కురిసిన వర్షాలకు జిల్లా వ్యాప్తంగా అనేక మంది రైతులు వరి, ప్రతి ,మొక్కజొన్న పండించేందుకు సిద్ధంగా ఉన్న సమయంలో తుపాను కారణంగా వీరంతా నష్టపోవడం జరిగిందన్నారు. రైతులంతా పంటలపై ఎంతో పెట్టుబడి పెట్టడం జరిగిందన్నారు. కావున జిల్లావ్యాప్తంగా అనేక మండల, గ్రామ, కేంద్రాలలో పంటలు నష్టపోయిన రైతులను గుర్తించి వారికి సరైన నష్టపరిహారం చెల్లించాలన్నారు. అలాగే ఇటీవల కురిసిన వర్షాల కారణంగా వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు..

విశాఖ-అరకు రహదారిలో కూలిన భారీ వృక్షం...

విశాలాంధ్ర-శృంగవరపుకోట రూరల్: శృంగవరపుకోట మండలం కాపు సోంపురం వద్ద విశాఖ-అరకు రహదారిలో తుఫాన్ గాలులకు బుధవారం ఉదయం భారీ వృక్షం కూలి రహదారిపై పడింది దీంతో ట్రాఫిక్ తీవ్ర అంతరాయం కలిగింది సీఐ వి.నారాయణమూర్తి తన సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్లి కూలిన చెట్టును వెంటనే తొలగించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించారు. పోలీసుల వేగవంతమైన చర్యతో పెద్ద ప్రమాదం తప్పింది. స్థానికులు వారి స్పందనను ప్రశంసిస్తూ ధన్యవాదాలు తెలిపారు.

వర్షంతో రహదారిపై నీరు - ట్రాఫిక్ నియంత్రణలో పోలీసులు అప్రమత్తం

- సందర్శించిన ఎమ్మెల్యే మాధవి, మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు

విశాలాంధ్ర వార్త కథనానికి స్పందన

విశాలాంధ్ర-భోగాపురం: "రహదారి జలదిగ్బంధనం-ప్రయాణీకుల ఇబ్బందులు" అన్న శీర్షికన విశాలాంధ్రలో వచ్చిన వార్త కథనానికి అధికారు లు, నాయకులు ఎట్టకేలకు స్పందించారు. భోగాపురం పోలీస్ స్టేషన్ సిఐ కూనదుర్గ ప్రసాదరావు నేతృత్వంలో పోలీసులు రహదారిపై నిలిచిన నీటిని పరిశీలించి, వాహనదారులు సురక్షితంగా వెళ్లేలా మార్గదర్శనం చేశారు. ఆయన సిబ్బందితో ఉదయాన్నే రాజపులోవ రహదారి వద్దకు చేరుకొన్నారు. నీటి ప్రవాహం తగ్గడంతో రహదారిపై వాహన రాకపోకలు పునరుద్ధించారు. రహదారిపై మోకాళ్ల వరకు నీరు చేరడంతో పరిస్థితిని గమనించిన ట్రాఫిక్‌ను క్రమబద్ధం చేశారు. రహదారిపై వాహనదారులు సురక్షితంగా వెళ్లేలా రహదారిపై తాత్కాలిక గుర్తులు ఏర్పాటు చేస్తూ, నీటి ప్రవాహాన్ని అంచనా వేసి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు చేపట్టారు. రహదారిపై నిలిచిన వాహనాలను పక్కకు తరలిస్తూ, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిరంతర పర్యవేక్షణ చేసారు. అనంతరం ఎమ్మెల్యే మార్ఫెడ్ చైర్మన్ రహదారి వద్దకు చేరుకొని పరిస్థిని గమనించి ఈ సమస్య పరిస్కారం కోసం చర్యలు చేపడతామని తెలిపారు. ఎమ్మెల్యే లోకం మాధవి రాజపులోవ రహదారి వద్దకు చేసుకొని నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న గోడను తొలగించారు. ప్రక్కన ఉన్న చెరువు ఆక్రమణకు గురైనట్టు గుర్తించి చెరువు అక్రమణపై సమగ్ర విచారణ జరపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే, రహదారిపై నీటి నిల్వ సమస్యను శాశ్వతంగా పరిష్కరించి, ప్రయాణికులకు, గ్రామ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

తుఫాను సహయ చర్యలకై మున్సిపల్ కంట్రోల్ రూమ్ కి డయల్ చేయండి

- మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి

విశాలాంధ్ర-బొబ్బిలి: మొంథా తుఫాను తీరం దాటిన పిదప కురిసిన వర్షాలకు జలమయమైన అప్పయ్యపేట, సాలవారి తోట, గొల్లపల్లి మరియు పాత బొబ్బిలి ప్రాంతాలను మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి సిబ్బంది తో సందర్శించి పరిశీలన చేశారు.అప్పయ్యపేట ప్రాంతంలో నీరు నిలిచిపోయి జనావాసాల గుండా ప్రవహిస్తున్నట్లుగా గుర్తించి చైన్ జెసిబి తో నీటిని మళ్లించే చర్యలను చేపట్టారు. సాలవారి తోట ఏరియాలో గత కొంతకాలంగా ఉన్న చెరువు సమస్యను జెసిబి తో క్లియర్ చేయించారు. పాత బొబ్బిలి టిబిఆర్ థియేటర్ వద్ద మరియు పాత బొబ్బిలి ఊరు చివర ఉన్న భైరవ సాగరం చెరువు వద్ద ఉన్న కల్వర్టును పరిశీలించి జెసిబి తో నీటిని మళ్లించే చర్యలు చేపట్టారు. గొల్లపల్లి గ్రామంలో గత పది సంవత్సరములుగా ఉన్న చెరువు నీటి సమస్యను జెసిబి తో క్లియర్ చేయించి శాశ్వత పరిష్కారం చూపించారు. పట్టణ పరిధిలో ఎక్కడైనా నీరు నిలిచిపోయినట్లయితే మరియు ఎటువంటి తుఫాను సహాయక చర్యల నిమిత్తం అయినా పురపాలక సంఘ కంట్రోల్ రూమ్ నెంబరు. 9989817042 కు సమాచారం అందించాల్సిందిగా మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి కోరారు. తుఫాను తీరం దాటినప్పటికీ ఇంకను రానున్న రెండు రోజులలో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కాచి చల్లార్చిన నీటిని మాత్రమే త్రాగాలని ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి తెలియజేశారు. మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి వెంట ఏఈ ఈశ్వర గుప్తా, శానిటరీ ఇన్స్పెక్టర్ మురళి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా విద్యా, వైద్యం పై కాసులేరుకుంటున్న కూటమి నేతలు

35

- ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాలి...
- సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాల్సిన పాలకులు అందరికీ ఉచిత విద్యా, వైద్యం అనే హామీలు కేవలం కాగితాలకే పరిమితం చేసి ప్రజా విద్య, వైద్యం పై కూటమి ప్రభుత్వ పాలకులు కాసులేరు కుంటున్నారని సిపిఐ జిల్లా సహాయ బుగత అశోక్ విమర్శించారు. బుధవారం భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) మార్కెట్ శాఖా సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆధీనంలో ఉండాల్సిన ప్రజారంగ సంస్థలను ప్రైవేటుపరం చేసి కార్పొరేట్ దోపిడీ వర్గాలకు అప్పజెప్పేస్తు చంద్రబాబు కూటమి ప్రభుత్వ చేతకానితనాన్ని నిరూపించు కుంటున్నారని దుయ్యబట్టారు. ఆంధ్ర రాష్ట్రంలో అందరికీ వైద్య విద్యను అభ్యసించడానికి అవకాశం కల్పించడానికి నేషనల్ మెడికల్ కౌన్సిల్ ను గత ప్రభుత్వం కోరిక మేరకు 17 మెడికల్ కాలేజీలు ప్రభుత్వరంగ సంస్థలో నడపడానికి అవకాశం కల్పిస్తూ నిధులు కల్పించిందన్నారు. ఆనాడు ఒకేసారి 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రారం భించడానికి ఆర్థిక పరిస్థితులు సరిపోవడం లేదని ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకున్నదన్నారు. అదేమిటంటే మొదటి విడతలో 5 కళా శాలలు, రెండ వ విడత 5 కళాశాలలు, మూడో విడతలు 7 కళాశాలల్ని ప్రారంభి స్తామని ఆనాటి వైకాపా ప్రభుత్వం తెలిపిందన్నారు. విద్యార్థులకు ఇచ్చిన హామీలో భాగంగా మొదటి విడతలో 5 మెడికల్ కళాశాలల నిర్మాణం సకాలం లో పూర్తిచేసి మచిలీపట్నం, ఏలూరు, విజయ నగరం, రాజమహేంద్రవరం, నంద్యాలలో ప్రారంభిం చడం జరిగిందన్నారు. అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ ఇప్పటి విద్యాశాఖ మంత్రి యువగళం పాదయాత్ర చేసినప్పుడు వేలాది మంది విద్యార్థి యువతను సమీకరించి "ప్రస్తుతం అధికారంలో ఉన్నటువంటి వైకాపా ప్రభుత్వం వైద్య విద్యను అంగట్లో సరుకులాగా అమ్మేస్తున్నారు కాబట్టి మన ప్రభుత్వం అధికారంలోకి రాగానే 100 రోజుల్లోనే ఈ జీవో నెంబర్ 107, 108 రద్దు చేస్తాను, వైద్య విద్యను ప్రతిఒక్క విద్యార్థికి అందేవిధంగా చొరవ చేపడతానని" హామీ ఇచ్చిన సంగతి అధికారం రాగానే లోకేష్ మతి ఏమైందని ప్రశ్నించారు. గత ప్రభుత్వం కేవలం సెల్ఫ్ ఫైనాన్స్ కోట పేరుతో 50 పర్సెంట్ సీట్లను కార్పొరేట్ విధానంగా నడిపారు కానీ ఇప్పుడు అధికారంలో ఉన్న ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏకంగా పి.పి.పి పద్ధతిలో పబ్లిక్, ప్రైవేట్, పార్ట్నర్షిప్ భాగస్వామ్యం అనే పాలకుల జేబులు నింపుకోవడానికి ఈ దుర్మార్గ విధానంతో ఏకంగా కళాశాలలన్నీ కూటమి ప్రభుత్వం కార్పొరేట్లకు అప్పనంగా కట్టబెట్టేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవడి సొమ్ముని ఎవడికి దానధర్మం చేస్తున్నారని మండిపడ్డారు. ఒక ఎకరా ప్రభుత్వ భూమిని 99 రూపాయలకు ఇస్తారా..? ప్రజలు ఓట్లేసి గెలిపించి మిమల్ని నమ్మి గద్దెనెక్కిస్తే ప్రజలకు, ప్రజల ఆస్తులకు రక్షణ ఉండి సమర్థవంతంగా నడిపిం చడం చేతకాక ప్రజారంగ సంస్థలపైన, భూములపైన కార్పొరేట్లకు పెత్తనం ఇస్తూ నిస్సిగ్గుగా 66 సంవత్సరాలకు లీజు అగ్రిమెంట్ ఇస్తారా అని ప్రశ్నిం చారు. మీ నియంతృత్వ విధానాల వల్ల బడుగు బలహీనవర్గాల, మధ్యతరగతి విద్యార్థులకు తీరని శాపంగా మారుతోందన్నారు. డబ్బు ఉన్నవాడు కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి లేదా వారి పలుకుబడిని ఉపయోగించి అప్పులు చేసి మరీ విద్యను అభ్యసించి వైద్యునిగా స్థిరపడిన తర్వాత కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి ఆధునిక భవనాలు, వైద్య యంత్ర పరికరాలు ఏర్పాటు చేసి పెట్టుబడిగా పెట్టి వైద్యరంగాన్ని వ్యాపారంగా తయారై పేద, మధ్య తరగతి ప్రజలను కార్పొరేట్ వైద్యం పేరుతో రక్తం పీల్చే జలగల్ల దోపిడీ చేస్తుండటం మీ కళ్ళకి కనబడలేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి సామాజిక, ఆర్థిక దోపిడీ విధానాలకి అడ్డుకట్ట వేయాలంటే ఆంధ్రప్రదేశ్ లో 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని మీ పాలకులు సుదీర్ఘంగా చర్చించి అవసరమైతే అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేసి ఆ వైపుగా తీర్మానం చేసి ఆమోదం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనియెడల పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలకి శ్రీకారం చుడతామని రాష్ట్ర ప్రభుత్వం హెచ్చరించారు.

అప్పలరాజు మృతి బాధాకరం

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, విశాలాంధ్ర విజ్ఞాన సమితి సభ్యులు కామేశ్వరరావు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : విశాలాంధ్ర విశాఖపట్నం బుక్ హౌస్ మేనేజర్ పోలవరపు అప్పలరాజు మంగళవారం గుండెపోటుతో మరణించడం అత్యంత బాధాకరమని, ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విశాలాంధ్ర విజ్ఞాన సమితి సభ్యులు పి కామేశ్వరరావు అన్నారు. అప్పలరాజు పేపరు బోయ్ గా జీవితం ప్రారంభించి, 1996లో విశాలాంధ్ర బుక్ హౌస్ లో చిన్న ఉద్యోగంలో చేరి అంచెలంచెలుగా ఎదిగి శ్రీకాకుళం బ్రాంచ్ మేనేజర్ గా, అనంతరం విశాఖపట్నం మేనేజర్ గా సమర్థవంతంగా తమ విధులను నిర్వర్తించారన్నారు. ఎల్లప్పుడు విశాలాంధ్ర బుక్ హౌస్ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు.ఆయన అకాల మరణం సంస్థకు తీరని లోటన్నారు. ఆయన కుటుంబానికి సిపిఐ పార్టీ తరపున, విశాలాంధ్ర విజ్ఞాన సమితి తరపున ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామన్నారు.

మొంథా తుఫాను దృష్ట్యా కలెక్టర్ ఆదేశాలు

విశాలాంధ్ర-తెర్లాం : మొంత తుఫాను దృష్ట్యా కలెక్టర్ వారి ఆదేశాలు అనుసరించి, గంగన్నపాడు గ్రామం లో పూరి పాకాల్లో నివాసం ఉంటున్న వారిని గుర్తించి, బలహీనంగా ఉన్న ఇళ్లల్లో ఉన్న వృద్ధులను, ఎల్లమ్మ ను ముందుగా పునరావాస కేంద్రాలకు తహసీల్దార్, ఎం డి ఓ తరలించడం జరిగింది. సోమవారం రాత్రి మరియు మంగళవారం ఉదయం కురిసిన వర్షం కి సిద్దల దాలమ్మ యొక్క ఇంటి గోడ పడిపోయింది. అధికారులు ముందుగా స్పందించి పునరావాసం కల్పించడం వలన ఎవరికీ ఎటువంటి హాని జరగదని తహసీల్దార్ హేమంత్ కుమార్ తెలిపారు.

మొంథా తుఫాన్ నేపథ్యంలో మెంటాడ లో పర్యటించిన మంత్రి సంధ్యారాణి

లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించిన మంత్రి సంధ్యారాణి

విశాలాంధ్ర- మెంటాడ:మొంథా తుఫాన్ ప్రభావం దృష్ట్యా మెంటాడ మండలంలో ఏర్పడిన పరిస్థితులను రాష్ట్ర గిరిజన, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి సమీక్షించారు. మండలంలోని అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి, ప్రజల భద్రతకు ఎలాంటి లోపం రాకుండా చూడాలని సూచించారు.లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని, నదీ తీర ప్రాంతాల్లో ఉన్న గ్రామాల్లో జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. బడేవలస, జగన్నాధపురం, ఆగూరు పంచాయతీలకు చెందిన అనుబంధ గ్రామాల్లో అధికారులు పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని మంత్రివర్యులు సూచించారు.తుఫాన్ కారణంగా పునరావాస కేంద్రాలకు తరలించబడిన కస్తూర్బా విద్యార్థినులను పరామర్శించి, వారి యోగక్షేమాలు తెలుసుకున్న మంత్రి సంధ్యారాణి, అవసరమైతే మండల రైతులకు ఇబ్బందులు లేకుండా పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయిస్తామని తెలిపారు.గర్భిణీ స్త్రీలు, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వారు ఏడో నెల దాటిన తర్వాత అవసరమైతే సమీప పీహెచ్‌సీ కేంద్రాల్లో తాత్కాలికంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని వైద్య అధికారులను ఆదేశించారు.అరటి, వరి, మొక్కజొన్న వంటి పంటల నష్టాన్ని ఎటువంటి తారతమ్యం లేకుండా సర్వే చేసి రైతులకు పరిహారం అందించాలన్నారు. రెవెన్యూ శాఖ అధికారులు తక్షణమే ఇసుక బస్తాలు సిద్ధం చేసుకోవాలని, హౌసింగ్ శాఖ అధికారులు పూర్తిగా దెబ్బతిన్న ఇళ్లను గుర్తించి నివేదికలు సమర్పించాలని సూచించారు.గ్రామాల్లో ప్రజలకు రోగాలు రాకుండా ముందస్తుగా క్లోరినేషన్ చేసి త్రాగునీరు అందించాలనీ, చెత్త, చెదారం నిల్వ ఉండకుండా పంచాయతీలు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో అందుబాటులో ఉండి ప్రజల ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించాలని తెలిపారు.రైతుల నుంచి తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని మంత్రివర్యులు ప్రకటించారు. జగన్నాధపురం, బడేవలస గ్రామాలకు తక్షణమే శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.గిరిజన గ్రామాలకు వర్షాల ప్రభావం కారణంగా రవాణా అంతరాయం ఏర్పడినపుడు రేషన్ సరుకులు ఇంటివద్దకే అందించాలి అని చెప్పారు. విద్యుత్ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండి, కరెంటు సరఫరాలో అంతరాయం తలెత్తిన వెంటనే చర్యలు చేపట్టాలని ఆమె ఆదేశించారు.జగన్నాధపురం, బడేవలస గ్రామాలకు వెళ్లే రహదారుల అభివృద్ధికి తక్షణమే మూడేసి లక్షల రూపాయల చొప్పున నిధులు కేటాయించి రహదారి సౌకర్యం కల్పించాల్సిందిగా ఇరిగేషన్ అధికారులకు మంత్రి సంధ్యారాణి సూచించారు.కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చలుమూరి వెంకట్రావు, గెద్ద అన్నవరం, గొర్లె ముసలి నాయుడు, రెడ్డి ఎర్రి నాయుడు, ఎంఆర్వో అరుణ కుమారి, స్పెషల్ ఆఫీసర్ చిట్టి రాజు, ఎంపీడీవో భానుమూర్తి, డిప్యూటీ డిఈఓ మోహన్ రావు, డీఎస్పీ భవ్య రెడ్డి, సీఐ శ్రీనివాసరావు, ఎస్సై సీతారాం, డాక్టర్ లోకప్రియ, ఏవో గూగుల్ కృష్ణ, పిఆర్‌జెఈ గౌతమ్, ఇరిగేషన్ అధికారులు మరియు ఇతర మండల అధికారులు పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థినులను పరామర్శించిన ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు

మెంటాడ- విశాలాంధ్ర :గతరెండు రోజులుగా కురుస్తున్న మొంథా తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురవడంతోమెంటాడ కేజీబీవీ పాఠశాల భవనంలో నీరు చేరడంతో అసౌకర్యంగా విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ ఆదేశాలు మేరకు విద్యార్థులను సురక్షిత ప్రాంతాలకు చేర్చాలని ఆదేశాలు జారీ కావడంతో మండలఅధికారులు చొరవ తీసుకుని మెంటాడ హై స్కూల్ కంట్రోల్ రూమ్ కు 209 మంది విద్యార్థులను మంగళవారం అర్ధరాత్రి సమయంలో తరలించారు. ఈ విషయం తెలుసుకున్న గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదే శ్రీనివాస నాయుడు కేజీబీవీ నీరు చేరిన పర్యవేక్షించారు, అలాగే పునరావాస్ కేంద్రమైన మెంటాడ హైస్కూల్లో విద్యార్థులను పరిశీలించి మండలం ఆంధ్ర రిజర్వాయర్ లోకి భారీగా నీరు చేరింది. జిల్లా అధికారులు, ఇరిగేషన్ శాఖ సూచనల మేరకు రిజర్వాయర్ స్టీల్వే గేట్ల ద్వారా చంపావతి నదిలోకి నీటిని విస్తృతంగా విడుదల చేయడం జరిగింది.దీని ప్రభావంతో మెంటాడ మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ) ప్రాంగణంలోకి వరదనీరు చేరింది. దీంతో హాస్టల్‌లో ఉన్న విద్యార్థినులను సురక్షితంగా తరలించి, మెంటాడ జెడ్‌పీ హైస్కూల్‌లో 208 మంది విద్యార్థినులకు తాత్కాలిక వసతి కల్పించారు.ఈ నేపథ్యంలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ డా. గాదె శ్రీనివాసులు నాయుడు మెంటాడకు చేరుకొని వసతి కేంద్రంలో ఉన్న విద్యార్థినులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని ఆరాతీశారు. అనంతరం నెల్లిమర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను సందర్శించి, వైద్య సిబ్బందితో మాట్లాడి వారికి మెరుగైన చికిత్స అందించాలని సూచించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ "జిల్లా కలెక్టర్ అన్ని విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించినప్పటికీ విద్యాశాఖ అధికారులు కేజీబీవీలు, రెసిడెన్షియల్ పాఠశాలలకు సెలవులు ఇవ్వకపోవడం దురదృష్టకరం. గుర్ల కేజీబీవీ లో షార్ట్ సర్క్యూట్ ఘటన, మెంటాడ కేజీబీవీ వరద ముంపు సంఘటనలు విద్యాశాఖ నిర్లక్ష్యానికి నిదర్శనం" అని ఆయన అన్నారు.శ్రీనివాసులు నాయుడు మెంటాడ కేజీబీవీ పాఠశాల ప్రాంగణాన్ని కూడా ప్రత్యక్షంగా పరిశీలించి విద్యార్థినుల అవసరాలు, వసతి పరిస్థితులపై అవగాహన ఆరా తీశారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అరుణ్ కుమారి, డిప్యూటీ డిఇఓ కె.మోహన్ రావు, కేజీబీవీ ప్రిన్సిపాల్ శారద, పి.ఆర్.టి.యు మండల అధ్యక్షులు సిరిపురం కృష్ణ, బోధనా సిబ్బంది పాల్గొన్నారు.

జనవరి 24, 25 తేదీల్లో టైపు రైటింగ్ పరీక్షలు

విశాలాంధ్ర-విజయనగరం కంటోన్మెంట్: ఆంధ్రప్రదేశ్ సాంకేతిక విద్యా మండలి ఆదేశాలతో వచ్చే ఏడాది జనవరి 24, 25 తేదీల్లో టైపు రైటింగ్, షార్ట్ హ్యాండ్ పరీక్షలు జరగనున్నాయని శ్రీరామ టైప్ ఇనిస్టిట్యూటు ప్రిన్సిపల్ అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. టైపురైటింగ్ నేర్చుకోవడం వల్ల వ్యక్తిత్వ వికాశంతో పాటు ఆంగ్లంపై మంచి పట్టు సాధించవచ్చున్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ సమీప టైపు రైటింగ్ కేంద్రాలకు వెళ్లాలన్నారు. ఇతర వివరాల కోసం 9491206325, 9381106638 నంబర్లులో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఈ సమస్యకు పరిష్కారం దొరకదా ?

విశాలాంధ్ర-విజయనగరం కంటోన్మెంట్: నగరంలో శివారు ప్రాంతం వైఎస్ఆర్ నగర్ ఇక్కడ రైల్వే వంతెన కింద వర్షం పడితే భయానకమైన వాతావరణం నెలకొంటుంది. నీరు నిలిచిపోయి రాకపోకలు స్తంభించిపోతాయి. సుమారు 3 నుంచి 4గంటల వరకూ నీటి ఉధృతి తగ్గే వరకూ వేచి ఉండాల్సిందే. ఒకవేళ తెగించి ఆ వంతెన దగ్గర దాటాలని చూస్తే సుమారు అయిదు అడుగుల లోతులో మునిగిపోవాల్సిందే. ఈ దారి మీదుగా వైఎస్ఆర్ నగర్ పాటు ప్రభుత్వ వైద్య కళాశాల, ఈఎస్ ఐ ఆసుపత్రితో పాటు కొండవెలగాడ, కొండకరకం, సోనియా నగర్ ప్రాంతాలు మీదుగా మరో పది గ్రామాల ప్రజల రాకపోకలు ఆదారపడి ఉన్నాయి. ఈ సమస్య ఎప్పటి నుంచో ఉన్నప్పటికీ రైల్వే శాఖతో మాట్లాడి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేకపోతున్నారు. అయితే తాత్కాలిక ఉపశమనం కల్పిస్తూ విజయనగరం నియోజకవర్గ శాసనసభ్యులు పూసపాటి అదితి గజపతిరాజు నగరపాలక సంస్థ అధికారులతో మాట్లాడి, వైఎస్ఆర్ నగర్ స్థానిక నాయకుల చొరవతో పారిశుద్ధ్య కార్మికులను పెట్టి ఎప్పటికప్పుడు నీరు నిలిచిపోకుండా నీరు సజావుగా ముందుకు వెళ్లిపోయేలా పూడికలు తీయించే ఏర్పాట్లు చేశారు.

వంగర మండలంలో అందుబాటులోకి ఫ్రీ జర్ బాక్స్

విశాలాంధ్ర-వంగర: మానవత రాజాం శాఖ సౌజన్యంతో జనహిత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యములో వంగర లో శీతల శవ పేటిక (ఫ్రీజర్ బాక్సు) ను ఈరోజు నుండి అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని జనహిత సంస్థ అధ్యక్షులు కాంబోతుల రమణ తెలిపారు. రవణ తనసొంత నిధులతో బాక్సు ను మరమ్మత్తు చేసి భద్రపరిచేందుకు వంగర పి.హెచ్ సి సమీపంలో గది నిర్మించి ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాజాం మానవత శాఖ ప్రధాన కార్యదర్శి ఉల్లాకుల నీలకంటేశ్వర యాదవ్, కార్యవర్గ సభ్యులు పండూరి వేణుగోపాల్, జనహిత సంస్థ అధ్యక్షులు కాంబోతుల రమణ, ప్రతినిధులు బెవర సాయరాం నాయుడు రాజాంనియోజక వర్గ టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులు,విజయనగరం జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు మజ్జి గణపతి, బలగ పోలినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ రాజేష్ పరామర్శ

విశాలాంధ్ర-రాజాం: రాజాం మున్సిపాలిటీలోని గొల్ల వీధికి చెందిన వైయస్సార్సీపీ సీనియర్ నాయకుడు డోప్పు సింహాచలం ఇటీవల మృతిచెందిన విషయం తెలిసిన వెంటనే, రాజాం నియోజకవర్గ వైఎస్ఆర్సీపీ ఇంచార్జ్ డాక్టర్ తలే రాజేష్ సింహాచలం నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో మాట్లాడిన డాక్టర్ రాజేష్, వారి దుఃఖంలో తమ పార్టీ తరఫున ప్రగాఢ సానుభూతి తెలిపారు.సింహాచలం పార్టీకి అందించిన సేవలు మరువలేనివని, ఆయన మరణం వైయస్సార్సీపీకి తీరని లోటు అని డాక్టర్ రాజేష్ అన్నారు. ఇలాంటి సమయంలో పార్టీ ఎల్లప్పుడూ వారి కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సీపీ టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, నియోజకవర్గ పబ్లిసిటీ విభాగం అధ్యక్షుడు ఆసపు సూర్యం, విష్ణు పాత్రుని శంకర్రావు, జి.పాపారావు, డోప్పతవిటి నాయుడు, గౌరీ శంకర్ వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి మద్యం సీసా 'సురక్ష యాప్' ద్వారానే విక్రయం తప్పనిసరి

ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఎస్సై వి.ఎన్. రాజు

విశాలాంధ్ర-వేపాడ : ప్రభుత్వం అమలు చేస్తున్న కొత్త నిబంధనల ప్రకారం ఇకపై ప్రతి మద్యం సీసా "ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్" ద్వారా మాత్రమే అమ్మకాలు జరగాలని ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఎస్సై వి.ఎన్.రాజు కఠిన హెచ్చరికలు జారీ చేశారు. బుధవారం ఆయన మండలంలోని లైసెన్స్ కలిగిన మద్యం దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.తనిఖీల్లో భాగంగా ఎస్సై రాజు మాట్లాడుతూ"ప్రతి మద్యం షాప్ యాజమాన్యం యాప్ ద్వారా మాత్రమే విక్రయాలు జరపాలి. సురక్ష యాప్‌ను వదిలిపెట్టి పాత పద్ధతుల్లో అమ్మకాలు కొనసాగిస్తే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవు" అని స్పష్టం చేశారు.అలాగే, లైసెన్స్ పొందిన దుకాణాల నుండి గొలుసు షాపులకు లేదా అక్రమ దాబాలకు మద్యం సరఫరా చేస్తే కేసులు నమోదు చేసి లైసెన్సులు రద్దు చేయడం సహా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.దాబాలలో మద్యం తాగించే వారిపై కూడా కఠిన చర్యలు తప్పవని చెప్పారు.వేపాడ,వల్లంపూడి,కృష్ణరాయుడుపేట,అంకా జోష్యులపాలెం గ్రామాలలో బెల్ట్‌షాపులు మరియు నాటుసారా తయారీ కేంద్రాలపై విస్తృత సోదాలు నిర్వహించినట్లు తెలిపారు.ఈ తనిఖీల్లో అక్రమ కార్యకలాపాలు ఏవీ కనుగొనబడలేకపోయాయి, అయినా నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని ఎస్సై రాజు వెల్లడించారు.ఈ తనిఖీల్లో ప్రొహిబిషన్ ఎక్సైజ్ సిబ్బంది పి. వీర్రాజు, హెచ్.సి.బి. హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గో సంరక్షణ రాష్ట్ర కమిటీలో శాంతి దేవి నియామకం

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : రాష్ట్రంలో గో సంరక్షణకు, జంతు సంక్షేమానికి విశిష్ట సేవలు అందించాలని రాష్ట్ర స్థాయిలో పదవి బాధ్యతలు అప్పగిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ గో సంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు జీవ బంధు లోగిశ. రామకృష్ణ అన్నారు. బుధవారం జిల్లా గో సంరక్షణ కార్యాలయంలో జరిగిన మహిళా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జంతువులు పట్ల జరుగుతున్న దారుణాలను, గో మాంసం విక్రయాలు, అక్రమ పశు రవాణాకు వ్యతిరేకంగా పోరాడవలసిన అవసరం ఉందని జిల్లా నుండి గత కొన్ని సంవత్సరాలుగా సేవలు అందిస్తున్న విజయనగరానికి చెందిన ఘుండికోట. శాంతి ని రాష్ట్ర కార్యదర్శిగా, నీలావుదేవి ని రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలుగా నియమిస్తూ నియామక ఉత్తర్వులు అందచేస్తున్నట్లు తెలిపారు. ఇచ్చిన పదవి బాధ్యతలను చిత్త శుద్దితో నిర్వహించాలని పదవి ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా ఘుండికోట. శాంతి, నీలావు దేవి మాట్లాడుతూ మాకిచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తామని మాకు ఈ పదవి ఇచ్చిన రాష్ట్ర నాయకత్వానికి, రాష్ట్ర అధ్యక్షులు లోగిశ రామకృష్ణ గారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె వి ఆర్ సత్యనారాయణ, జిల్లా గో సంరక్షణ సమాఖ్య మహిళా నాయకులు తాలాడ. పైడిరాజు, భీమపల్లి సంధ్యారాణి, ఎమ్ వి. మాధవి లత, జలగడుగుల. యోగి మల్లిక, అంతరపల్లి. మందాకిని, పతివాడ. శిరీష, కుందేటి. పార్వతి, సోము. సరస్వతి, కోట. మహాలక్ష్మి, చింతాడ. అనురాధ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ అభయ గణపతి ప్రతిష్టాపన అన్న సమారాధన లో మన సిరమ్మ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : స్థానిక ధర్మపురిలో శ్రీ అభయ గణపతి ప్రతిష్టాపన మరియు అన్నసమారాధన ఆహ్వానం మేరకు ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ చైర్ పర్సన్, వై.యస్.ఆర్.సీ.పి.జిల్లా అధ్యక్షులు,మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) కుమార్తె చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరమ్మ బుధవారం శ్రీ అభయ గణపతి ప్రతిష్టాపనా లో పాల్గొన్నారు. అనంతరం గణపతి పూజ, పుణ్యాహవచనం, గవ్యాంత మార్చనలు, పునః పూజలు,ధాన్యాది వాసం,అగ్ని ప్రతిష్ఠ, ఆవాహిత దేవతా హవనములు,లక్ష్మీ గణపతిహోమం తదితర కార్యక్రమాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమం లో పాల్గొని భక్తులకు ప్రసాదం వితరణ చేశారు. అభయ గణపతి ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరుకున్నారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు, ముఖ్యనాయకులు, గ్రామ ప్రజలు, చిన్న శ్రీను సోల్జర్స్ ఉపాధ్యక్షులు తోట వాసు, చిన్న శ్రీను సోల్జర్స్ సభ్యులు అధిక సంఖ్య లో పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి



విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని బక్కు నాయుడుపేటలో గల కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంను మండల విద్యాశాఖ అధికారులు ఎన్ నాగభూషణరావు పి బాల భాస్కరరావు బుధవారం సందర్శించారు.ఈ సందర్భంగా వారు పాఠశాల తరగతి గదులు, భవనాల నిర్మాణ పరిస్థితులను పరిశీలించారు.అనంతరం విద్యార్థులతో సమావేశమై మాట్లాడుతూ"మెంథా తుఫాను కారణంగా వర్షాలు, గాలులు,కొనసాగుతున్న సమయంలో విద్యార్థులు విద్యుత్ పట్ల అప్రమత్తంగా ఉండాలి.తడిచేతులతో గోడలు, స్విచ్‌బోర్డులుతాకరాదన్నారు.ఏవైనా సమస్యలు గమనిస్తే వెంటనే ఉపాధ్యాయులకు తెలపాలని సూచించారు.అలాగే విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు హాస్టల్ సిబ్బందికి కూడా పలు సూచనలు చేశారు.విద్యార్థులకు కాచి చల్లార్చిన గోరువెచ్చని నీటిని ఇవ్వాలని,వేడివేడిగా వండిన ఆహార పదార్థాలనే అందించాలని.పాత్రలను వేడి నీటితో శుభ్రపరచాలని. విద్యార్థుల వ్యక్తిగత శుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీమతి కిరణ్మయి, ఉపాధ్యాయులు, సిఆర్ఎంటి సభ్యులు పాల్గొన్నారు.

శుద్ధ జలము సరఫరా చేయండి

అంటువ్యాధులు రాకుండా చర్యలు తీసుకోండి కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి

విశాలాంధ్ర -తెర్లాం:జిల్లాలో వరద ప్రభావిత ప్రాంతాల పరిశీలనలో భాగంగా బుధవారం తెర్లాం మండలంలోని గంగన్నపాడు గ్రామాన్ని జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి ప్రత్యక్షంగా పరిశీలించారు. ఆ గ్రామం లో నర్సిపల్లి వారి బంధ చెరువు ఓవర్ ఫ్లో కావడంతో గ్రామంలోని ప్రధాన వీధుల్లో నీటి ప్రవాహం కొనసాగుతుండటం గమనించిన కలెక్టర్ ఇరిగేషన్ ఏఈ తో మాట్లాడి తక్షణం నీటి ప్రవాహం బయటకు పోయే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్న కలెక్టర్ ఎవరూ ప్రమాదానికి గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నీటి మట్టం పెరిగిన ప్రాంతాల ప్రజలు అవసరమైతే పునరావాస కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. ఇప్పటికే ప్రమాదకరంగా ఉన్న ప్రాంతాల్లోని నాలుగు కుటుంబాలను అధికారులు సురక్షితంగా పునరావాస కేంద్రాలకు తరలించారని పేర్కొన్నారు. నవంబర్ నెల కోట బియ్యం పంపిణీ జరుగుతుందా లేదా అని ఆరా తీశారు. నీటి ప్రవాహం పూర్తిగా తగ్గిన తరువాతనే ఆయా కుటుంబాలను తిరిగి తమ ఇళ్లకు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, గ్రామ పంచాయతీ అధికారులకు కలెక్టర్ ఆదేశించారు.అదేవిధంగా, వరద నీరు తగ్గిన తర్వాత గ్రామంలోని బోర్లు, హ్యాండ్పంపులు, నీటి ట్యాంకులలోని త్రాగునీటిని పరీక్షించి మాత్రమే ప్రజలకు సరఫరా చేయాలని, అప్పటివరకు వాటర్ ట్యాంకర్ల ద్వారా శుద్ధ జలాన్ని సరఫరా చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు.తుఫాన్ అనంతరం వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున గ్రామంలో శానిటేషన్ పనులు వేగవంతం చేయాలని, బ్లీచింగ్ పౌడర్ చల్లి దోమల నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఈ పర్యటనలో బొబ్బిలి ఆర్డీవో రామ్మోహన్ రావు, తహసీల్దార్ హేమంత్ కుమార్, ఎంపీడీవో రాంబాబు, ఇరిగేషన్ ఏఇ ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నరు.

మండలంలో ప్రత్యేకాధికారి సుడిగాలి పర్యటన

అధికారులను పరుగులు పెట్టించిన వైనం

విశాలాంధ్ర-జామి: మొంథా తుఫాను నేపథ్యంలో కలెక్టర్ ఇచ్చిన ఆదేశాల మేరకు మండల ప్రత్యేకాధికారిగా ఉన్న జిల్లా పర్యాటకశాఖాధికారి కుమార స్వామి గత మూడురోజులుగా మండలంలోని సుడిగాలి పర్యటనలు చేశారు. మండల కేంద్రంనుంచి పర్యవేక్షణ చేస్తూ, గ్రామాలకు స్వయంగా వెళ్ళి వాస్తవ పరిస్థితిలను తెలుసుకుని తగిన సూచనలు చేస్తున్నారు. ప్రమాదకరంగా గుర్తించి పలు గ్రామాలలో చెరువులను సందర్శించి స్థానికుల సహకారంతో గట్టులను పటిష్టంగా చేస్తున్నారు. అన్ని శాఖల అధికారులను తనతోపాటు పరుగులు పెట్టిస్తున్నారు. మంగళవారం అర్ధరాత్రి అయినా కంట్రోల్ రూంను వదిలిపెట్టలేదు. తిరిగి ఉదయం జాగరం గెడ్డవద్ద వర్షంనీరు రహదారిపైకి వచ్చిందని తెలుసుకుని అధికారులతో కలిసి వెళ్ళారు. అనంతరం భీమసింగిలో చాకిరేవు చెరువు కారణంగా రహదారులు, వరిపంటలు ముంపుకు గురయ్యాయని తెలుసుకుని వెంటనే వెళ్ళి పరిస్థితిలను గుర్తించి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. గ్రామంలోని రెల్లిపేట వాసులకు పునరవాసం ఏర్పాటు చేసారు. వారికి వసతితోపాటు భోజన ఏర్పాట్లు చేసి తగిన జాగ్రత్తలను తెలిపారు. ప్రత్యేకాధికారి కుమార స్వామి రెండు రోజులు అధికారులను పరుగులు పెట్టించి తానేంటో నిరూపించుకున్నారు. పరిస్తితి అంతా ఆధీనంలోకి రావడంతోపాటు ఎటువంటి ప్రాణ, ఆస్థి నష్టం లేకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు.

నందబలాగ రెవెన్యూ పరిధిలో ముందస్తు చర్యలు

విశాలాంధ్ర -తెర్లాం:వెంథా తుఫాను ప్రభావము వలన భారీ వర్షాలు పడే అవకాశము ఉన్నందున తహసీల్దార్ మరియు ఎంపీడీఓ ఆదేశాల మేరకు తెర్లాం మండలం నందబలాగ రెవెన్యూ పరిధి లో వేగవతి నది దగ్గరికి ప్రజలు కానీ మరియు పశువులు గాని ఎవరు దిగకుండా ఉండేటట్లు ముందస్తు చర్యలు భాగంగా వి ఆర్ ఓ, పీఎస్ , వి ఎస్, డబ్ల్యూ ఈ ఏ, డి ఏ అందరు కూడా సైక్లోన్ డ్యూటీ ప్రకారంగా నది ప్రవాహ ప్రదేశంలో చూడడం జరిగినది అని రెవిన్యూ కింద స్థాయి సిబ్బంది తెలిపారు.

గుర్ల కేజీబీవీ విద్యార్థులు డిశ్చార్జ్

విశాలాంధ్ర -గుర్ల:మండల కేంద్రంలో కస్తూర్బా పాఠశాలలో రాత్రి జరిగిన షార్ట్ సర్క్యూట్ వలన ఐదు గురు విద్యార్థినిలు కరెంట్ షాక్ కు గురైనారు.గురైన విద్యార్థినులను చికిత్స నిమిత్తం నెల్లిమర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వెంటనే చికిత్స అందడంతో ఆరోగ్యం మెరుగుపడిందని వైద్యులు తెలిపారు. బుధవారం ఉదయం విద్యార్థులను వైద్యులు డిశ్చార్జ్ చేశారు

తుఫాను కారణంగా అంగనవాడి లబ్ధిదారులకు రేషన్ పంపిణీ చేసిన సీడీపీఓ జాగాన విజయలక్ష్మి

విశాలాంధ్ర-బొబ్బిలి : మండలం రంగరాయపురం గ్రామంలో గల అంగన్వాడీ కేంద్రాలు లో తుఫాను కారణంగా పిల్లలకు సెలవులు ఇచ్చిన సందర్భంగా ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిణి జాగాన విజయలక్ష్మి చేతులు మీదుగా చిన్నారులకు గర్భిణీలకు బాలింతలకు రేషన్ సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షకురాలు పద్మ , అంగన్వాడీ కార్యకర్తలు రామలక్ష్మి, నారాయణమ్మ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను పరామర్శించిన జడ్పీ చైర్మన్, ఎమ్మెల్సీ, బిజెపి జిల్లా పార్టీ అధ్యక్షులు

విశాలాంధ్ర-గుర్ల:కస్తూర్బా పాఠశాల విద్యార్థులకు ప్రమాదం జరిగిన సంఘటన తెలుసుకొని నెల్లిమర్ల ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ గాదే శ్రీనివాస్ నాయుడు, జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షుడు రాజేష్ వర్మ బుధవారం పరామర్శించారు. ప్రమాద జరిగిన సంఘటన అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వాటిపై అధికారులు వివరించారు.

తుఫాను ప్రభావిత వరిపంటల పరిశీలన

విశాలాంధ్ర -డెంకాడ: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు దెబ్బతిన్న వరి పంటను నెల్లిమర్ల నియోజకవర్గం ఎమ్మెల్యే లోకం నాగ మాధవి మార్కెట్ చైర్మన్ కర్రోతు బంగారు రాజు గత రెండు రోజులుగా తుఫాన్ లో భాగం గా వీచిన గాలుల వల్ల దెబ్బతిన్న వరి పంటను బుధవారం పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ తుఫాన్ వల్ల వీచిన గాలులు వలన పడిపోయిన వరి పంటను వ్యవసాయ శాఖ మరియు రెవెన్యూ శాఖ ద్వారా పంట నష్టం నివేదికను తయారు చేయమని తెలిపారు.అలాగే తడిసిన ధాన్యమును ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేయుటకు మిల్లర్స్ కు ఆదేశాలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న మార్కెట్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు మాట్లాడుతూ తుఫాను వలన దెబ్బతిన్న వరి పంట ను ప్రతి పొలం కు వెళ్లి నష్టపోయిన రైతులు జాబితాను తయారు చేసి ప్రభుత్వముకు నివేదిక పంపించమని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల వ్యవసాయ అధికారి టి సంగీత మాట్లాడుతూ చొల్లంగిపేట లో 60 ఎకరాలు ,సింగవరంలో 5 ఎకరాలు, రఘుమండ లో 5 ఎకరాలు , గుణుపూరుపేట 0.20 ఎకరం మరియు మొదవలస లో 2 ఎకరాలు తుఫాను వల్ల వరి పంట పడిపోయిందని ప్రాథమికంగా నిర్ధారించడం జరిగింది. తెలిపారు ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి రాజారావు మండల ప్రజా పరిషత్ అధికారి భవాని ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్ రావు లోకం ప్రసాద్ , పల్లె భాస్కర్ రావు గ్రామ సర్పంచ్ కోరాడ కనకరాజు, ఎంపీటీసీ కిరణ్ ఫాణిరాజు సూర్య ప్రకాష్ చిన్నంనాయుడు జగదీశ్ రాజు సురేష్ రాజు టి సూరిబాబు,బి లక్ష్మణ్ ఏ ఈ ఓ రామకోటి మరియు వ్యవసాయ సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు.

ఆపద సమయాల్లో ఆరోపణలు విడనాడండి...

ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు..

విశాలాంధ్ర-చీపురుపల్లి : ప్రకృతి వైపరీత్యాల కారణంగా ప్రజలకు ఆపద వాటిల్లే సమయములో రాజకీయాలను విడనాడి ప్రజలను రక్షించడానికి అందరం కలిసికట్టుగా పని చేయాలని చీపురుపల్లి శాసనసభ్యులు కిమిడి కళా వెంకట్రావు అన్నారు. బుధవారం నాడు చీపురుపల్లి పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారధ్యంలో కూటమి ప్రభుత్వం పార్టీ పరంగా కాకుండా ప్రజల రక్షణార్థం అవసరమైన అత్యవసర సేవలను ముందస్తుగా ఏర్పాటు చేసిందన్నారు. విజన్ ఉన్న నాయకుడిగా చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయాలు కారణంగా రాష్ట్రంలో ఎటువంటి ప్రాణ నష్టం వాటిల్ల లేదని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. మెంతా తుఫాన్ కారణంగా ఎటువంటి నష్టం వాటిల్లకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీసుకున్న ముందస్తు చర్య కారణంగా ఎటువంటి ప్రాణం నష్టం వాటిల్ల లేదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందుచూపు కారణంగా తుఫాను ఘటన నుండి సురక్షితంగా బయట పడ్డామన్నారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాలలో డ్రోన్ సర్వేల ద్వారా పంట నష్టాలను గుర్తించి రైతులను ఆదుకోవడానికి తగిన నివేదికలు తయారు చేయాలని ఈ సందర్భంగా ఆయన అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారన్నారు. అంతేకాకుండా దేశంలోనే ఎక్కడా లేని ముఖ్యమంత్రిగా తాను నిద్రపోకుండా అధికారులను నిద్ర పోనివ్వకుండా రాష్ట్రంలోని 25 వేల మంది సచివాలయ ఉద్యోగులతో 16 సచివాలయ సిబ్బంది లను ముందస్తుగా అప్రమత్తం చేసి తుఫాన్ విపత్తు నుండి ప్రజలను రక్షించిన ఘనత చంద్రబాబు నాయుడుకి దక్కుతుందన్నారు. తుఫాను కారణంగా చీపురుపల్లి నియోజకవర్గం పరిధిలో గొర్ల మండలంలో జరిగిన విద్యుత్ సర్క్యూట్ సంఘటనను వైసీపీ నాయకులు రాజకీయం చేస్తూ ప్రజలను పక్కతోవ పట్టించడం సంస్కారం కాదన్నారు. ప్రజలకు ఇబ్బందికరమైన విపత్తు సమయంలో రాజకీయాలను పక్కనపెట్టి ప్రజలను రక్షించడానికి ప్రతి ఒక్కరం సహకరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చీపురుపల్లి తెలుగుదేశం పార్టీ నాయకులు రౌతు కాము నాయుడు, కనకమాలక్ష్మి ఆలయ కమిటీ చైర్మన్ గవిడి నాగరాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగాన రామారావు, టీసీ సెల్ అధ్యక్షులు ముల్లు రమణ, గరివిడి మండలం నాయకులు పైల బలరాం, సురేష్, చీపురుపల్లి గరివిడి మండలాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దగెడ్డలో పెరిగిన నీటిమట్టం

విశాలాంధ్ర-తెర్లాం: పెద్దగెడ్డలో నీటి విడుదల చేయడం వల్ల ప్రస్తుతం నందబలగ గ్రామంలో నీటి ప్రవాహం మంగళవారం కంటే 30 మీటర్లు ముందుకు వచ్చింది. ప్రస్తుత నీటి ప్రవాహం నుంచి జనావాసాలు 350 మీటర్ల దూరం ఉందని తహసీల్దార్ హేమంత్ కుమార్ బుధవారం ఆ గ్రామాలను పరిశీలించి తెలిపారు. ముందస్తు చర్యల్లో భాగం గా టామ్ టామ్ వేయించడం తో పాటు ప్రతీ ఇంటికి వి ఆర్ ఓ ల ద్వారా తెలియపర్చడం జరిగింది అని నది లోనికి జనం వెళ్లే అవకాశం ఉన్న మార్గాలు మూసివేయడం జరిగింది. పహారా గా సచివాలయ సిబ్బందిని ఉంచడం జరిగింది అని తెలిపారు. నందబలగ, కుసుమురు గ్రామాల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయడం అయినది. అవసరం మేరకు జనం ని తరలించడం జరుగుతుంది అని నందబలగ గ్రామంల్లో అదనం గా ఆరుగురుని, కుసుమురు లో ముగ్గురిని పక్క గ్రామాల వి ఆర్ ఓ లని డిప్లాయ్ చేయడం జరిగిందని తెలిపారు. ఎండిఓఆర్ రాంబాబు గ్రామం లో పర్యటించి పరివాహక ప్రాంతం లో ఉన్న ప్రజలను అప్రమత్తం చేయడం జరిగింది. శానిటేషన్ మరియు డ్రింకింగ్ వాటర్ ఇబ్బంది లేకుండా రెండు గ్రామాల్లో అదనం గా ప్రతీ గ్రామానికి ముగ్గురు చప్పున ఎంపీడీఓ గారు పి ఎస్ లను డిప్లాయ్ చేయడం జరిగింది అని పరిస్థితి సాధారణ స్థితి వచ్చేవరకు గ్రామం లో ఉండి పర్యవేక్షిస్థామని తహసీల్దార్ హేమంత్ కుమార్ విలేకర్ల తో తెలిపారు.

తూకాలలో మోసాలు..

నష్టపోతున్న పట్టించుకోని అధికారులు..

విశాలాంధ్ర-చీపురుపల్లి : చీపురుపల్లి పౌరసరఫరాల గోడౌన్ ద్వారా డీలర్లకు సరఫరా జరుగుతున్న నిత్యవసర సరుకులలో ప్రత్యేకించి బియ్యం బస్తాలలో నాలుగు నుండి మూడు కేజీలు వరకు తరుగుదల జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు ఎందుకు పట్టించుకోవడంలేదని మేరకు మూడుదాం మండలం బుదరవలస గ్రామానికి చెందిన బూర్ల వెంకట అప్పలనాయుడు అనే డీలర్ బుధవారం నాడు ఆవేదన వ్యక్తం చేశారు. చీపురుపల్లి పట్టణ పరిధిలోని గోడౌన్ ద్వారా సరఫరా అవుతున్న బియ్యం బస్తాలలో బియ్యం తరుగుదల మూడు నుంచి నాలుగు కేజీల వరకు ఉంటున్నప్పటికీ అధికారులు పట్టించుకోకుండా డీలర్ల పైన పెత్తనం జరుగుతున్నారని ఆయన ఆరోపించారు. తరుగుదల కోసం ప్రశ్నిస్తే నచ్చితే తీసుకువెళ్లండి లేకుంటే మానేయండి అంటూ సంబంధిత అధికారులు డీలర్లను బెదిరిస్తున్నారు అంటూ ఆయన వాపోయారు. వాస్తవంగా ప్రభుత్వం నిర్దేశించిన సమయం మేరకు ఎమ్మెల్యే పాయింట్లు నుండి డీలర్లకు అవసరమైన బియ్యాన్ని ప్రభుత్వం నిర్దేశించిన కాటాల ద్వారా తూకం వేసుకొని తీసుకు వెళ్ళవలసిన పరిస్థితి ఉన్నప్పటికీ దానికి భిన్నంగా చీపురుపల్లి ఎమ్మెల్యే పాయింట్లు అధికారులు వివరిస్తున్నారు అంటూ ఆయన ఆరోపించారు. నియోజకవర్గ పరిధిలో డీలర్ల సంఘాలు ఉన్నప్పటికీ జరుగుతున్న మోసాలను ఎందుకు పట్టించుకోవట్లేదు అని ఆయన అవవేదన వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధముగా ఫుడ్ కార్పొరేషన్ నుంచి వస్తున్న బియ్యం బస్తాలను తూకం వేయకుండా లారీ నుండి లారీకి బస్తాలను అన్లోడింగ్ చేస్తూ సంబంధిత అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు అంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తాను వికలాంగుడు అయినప్పటికీ అధికారుల చర్యలను ఖండిస్తున్నామన్నారు. ఈ సంఘటనకు సంబంధించి బుధవారం నాడు గోడౌన్ ఇంచార్జ్ కే సన్యాసినాయుడిని ప్రశ్నించగా గత నాలుగు రోజులుగా గోడౌన్లో ఏర్పాటుచేసిన తూనిక యంత్రం మరమ్మత్తులకు గురి కావడంతో ప్రైవేటు తూనికే యంత్రం ద్వారా డీలర్ల ఇష్టపూర్వకం మేరకు నిత్యవసర సరుకులను పంపిణీ చేస్తున్నమన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజలకు సకాలంలో నిత్యవసర సరుకులు అందజేయుటకు ప్రైవేటు తూనికే యంత్రాలు ద్వారా సరుకులను పంపిణీ చేస్తున్నామని ఎటువంటి అక్రమాలకు పాల్పడడం లేదంటూ ఆయన వివరించారు. ..

పెద్ద ప్రమాదం తప్పింది

గల్లంతయిన విద్యార్థులు దొరికారు..

విశాలాంధ్ర-గుర్ల :మండలంలో గడిగెడ్డ రిజర్వాయర్ లో స్నానానికి దిగిన ఇద్దరు యువకులు దిగిన కొద్దిసేపటికే గల్లంతయ్యారు, సపట పైనుంచి కిందకు జరడం తో చేపల వేట కోసం సపట దిగువున ఉన్న స్థానికులు ప్రమాద గమనించి వెంటనే వారు అప్రమత్తమై ఇరువురుని రక్షించారు.వారు మెరకముడిదాం మండలం గర్భం గ్రామస్తులు గా గుర్తించారు.ప్రమాద విషయం తెలుసుకున్న తహసీల్దార్ పి ఆది లక్ష్మీ,ఎంపిడిఓ రవికుమార్,ఎస్ ఐ పి.నారాయణరావు లు సంఘటన స్థలానికి చేరు కొని గడిగెడ్డ లో సన్నానికి దిగిన ఇద్దరు యువకులు నుండి వివరాలు సేకరించారు.వారి తల్లి దండ్రులకు సమాచారం అందించారు.

గుర్తు తెలియని వ్యక్తి స్థానిక సిహెచ్‌సి లో మృతి

విశాలాంధ్ర-బాడంగి: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో గుర్తు తెలియని వ్యక్తి బుధవారం మృతి చెందాడని స్థానిక ఎస్సై తారకేశ్వరరావు తెలిపారు. మండలం లో గల డొంకిన వలస రైల్వే స్టేషన్ సమీపమునున్న గోపి నాయిని పట్నాయక్ చెరువు సమీపమున అపస్మారక స్థితిలో పడి ఉన్న ఒక వ్యక్తిని రెండు రోజుల కిందట స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో కొంతమంది జాయిన్ చేశారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందిన ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని ఆసుపత్రి మార్చు గదిలో ఉంచినట్లు ఆయన తెలిపారు. మృతుడు వివరాలు ఎవరికైనా తెలిసినట్లు యితే స్థానిక పోలీస్ స్టేషన్ సంప్రదించ వలసిందిగా ఆయన తెలిపారు. తెంటు వలస కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ముంపు ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే వెంకటరావు

విశాలాంధ్ర-గరివిడి: మండలం అప్పన్నవలస గ్రామంలో మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాల వల్ల వరి పంటలకు కొంత నష్టం సంభవించిన నేపథ్యంలో, రైతుల ఆత్మస్థైర్యాన్ని పెంచేందుకు చీపురుపల్లి శాసనసభ్యులు కిమిడి కళావెంకటరావు గ్రామాన్నిసందర్శించారు.ఎమ్మెల్యే కళావెంకటరావు అప్పన్నవలస లోని వరిచేలల్లో నడుస్తూ పంట పరిస్థితులను పరిశీలించారు. రైతులతో ఆత్మీయంగా మాట్లాడి, వారి సమస్యలను వినిపించుకుని, భరోసా కల్పిం చారు. ప్రతి రైతు వెన్నంటే ఉంటాం. పంట నష్టం జరిగిన చోట్ల ప్రభుత్వంతో మాట్లాడి అవసరమైన సహాయాన్ని అందించేలా కృషి చేస్తాం. అని ఎమ్మెల్యే ధైర్యం చెప్పారు.తుఫాన్ ప్రభావం వల్ల కలిగిన నష్టాన్ని అధికారులతో చర్చించి, త్వరితగతిన అంచనా వేయించి, రైతులకు ఆర్థిక సాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశిం చారు. గ్రామ ప్రజల అభిప్రాయాలను శ్రద్ధగావిని, ప్రతి కుటుంబం తిరిగి సాధికారంగా ముందుకు సాగేందుకు తగిన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు..ఈ కార్యక్రమంలో ఎస్సై బి లోకేశ్వరరావు, టిడిపి నాయకులు, రైతులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

తుఫాను ప్రభావిత వరిపంటలను పరిశీలించిన ఎమ్మెల్యే మాధవి, మార్కెట్ చైర్మన్ కర్రోతు

విశాలాంధ్ర దెంకాడ: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు దెబ్బతిన్న వరి పంటను నెల్లిమర్ల నియోజకవర్గం ఎమ్మెల్యే లోకం నాగ మాధవి మార్కెట్ చైర్మన్ కర్రోతు బంగారు రాజు గత రెండు రోజులుగా తుఫాన్ లో భాగం గా వీచిన గాలుల వల్ల దెబ్బతిన్న వరి పంటను బుధవారం పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ తుఫాన్ వల్ల వీచిన గాలులు వలన పడిపోయిన వరి పంటను వ్యవసాయ శాఖ మరియు రెవెన్యూ శాఖ ద్వారా పంట నష్టం నివేదికను తయారు చేయమని తెలిపారు.అలాగే తడిసిన ధాన్యమును ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేయుటకు మిల్లర్స్ కు ఆదేశాలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మార్కెట్ చైర్మన్ కర్రోతు బంగారురాజు మాట్లాడుతూ తుఫాను వలన దెబ్బతిన్న వరి పంట ను ప్రతి పొలం కు వెళ్లి నష్టపోయిన రైతులు జాబితాను తయారు చేసి ప్రభుత్వముకు నివేదిక పంపించమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల వ్యవసాయ అధికారి టి సంగీత మాట్లాడుతూ చొల్లంగిపేట లో 60 ఎకరాలు ,సింగవరంలో 5 ఎకరాలు, రఘుమండ లో 5 ఎకరాలు , గుణుపూరుపేట 0.20 ఎకరం మరియు మొదవలస లో 2 ఎకరాలు తుఫాను వల్ల వరి పంట పడిపోయిందని ప్రాథమికంగా నిర్ధారించడం జరిగింది. తెలిపారు ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి రాజారావు మండల ప్రజా పరిషత్ అధికారి భవాని ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్ రావు లోకం ప్రసాద్ , పల్లె భాస్కర్ రావు గ్రామ సర్పంచ్ కోరాడ కనకరాజు, ఎంపీటీసీ కిరణ్ ఫాణిరాజు సూర్య ప్రకాష్ చిన్నంనాయుడు జగదీశ్ రాజు సురేష్ రాజు టి సూరిబాబు,బి లక్ష్మణ్ ఏ ఈ ఓ రామకోటి మరియు వ్యవసాయ సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు.

మొంథా తుఫాన్ ప్రభావంతో కొండదాడి పంచాయతీలో దెబ్బతిన్న పంటలు, ఇళ్లు

విశాలాంధ్ర-గరివిడి: గరివిడి మండలం కొండదాడి పంచాయతీ పరిధిలో మొంథా తుఫాన్ కారణంగా మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసి పంటలకు గణనీయమైన నష్టం వాటిల్లింది. ప్రాథమిక సమాచారం ప్రకారం సుమారు 15 ఎకరాల వరి పంట నేలమట్టం అయింది. అదనంగా 14 టేకు చెట్లు కూలిపోవడంతోపాటు, 2 పూరి ఇళ్లు పూర్తిగా ధ్వంసమై, 3 పూరి ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి.ఈ ఘటనను స్థానిక అధికారులు వెంటనే ద ృష్టికి తీసుకున్నారు. తుఫాన్ కారణంగా రహదారులు చెదిరిపోవడంతో, బయటకు రాలేక ఇబ్బంది పడుతున్న చిన్న వెంకటాపురం, పెద్ద వెంకటాపురం, కొత్తూరు గ్రామాల్లో నివసించే వ ృద్ధులు, రోగులు, నిరుపేద కుటుంబాలు వంటి సుమారు 50 మందికి నిత్యావసర వస్తువులు అందజేశారు.సహాయక బ ృందం బియ్యం, కంది పప్పు, పెసరపప్పు, పంచదార, టీ పొడి, సాల్ట్ పాకెట్లు, పాల పాకెట్లు, పెరుగు పాకెట్లు, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు వంటి వస్తువులను ఇంటింటికీ వెళ్లి అందజేయడంతో పాటు వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో వీఆర్వో,పంచాయతీ కార్యదర్శి, వెలోరే అసిస్టెంట్,, గ్రామ పెద్దలు, సచివాలయం సిబ్బంది,యువత పాల్గొన్నారు.

మండలంలో ప్రత్యేకాధికారి సుడిగాలి పర్యటన

అధికారులను పరుగులు పెట్టించిన వైనం

విశాలాంధ్ర-జామి: మొంథా తుఫాను నేపధ్యంలో కలెక్టర్ ఇచ్చిన ఆదేశాల మేరకు మండల ప్రత్యేకాధికారిగా ఉన్న జిల్లా పర్యాటకశాఖాధికారి కుమార స్వామి గత మూడురోజులుగా మండలంలోని సుడిగాలి పర్యటనలు చేశారు. మండల కేంద్రంనుంచి పర్యవేక్షణ చేస్తూ, గ్రామాలకు స్వయంగా వెళ్ళి వాస్తవ పరిస్థితిలను తెలుసుకుని తగిన సూచనలు చేస్తున్నారు. ప్రమాదకరంగా గుర్తించి పలు గ్రామాలలో చెరువులను సందర్శించి స్థానికుల సహకారంతో గట్టులను పటిష్టంగా చేస్తున్నారు. అన్ని శాఖల అధికారులను తనతోపాటు పరుగులు పెట్టిస్తున్నారు. మంగళవారం అర్ధరాత్రి అయినా కంట్రోల్ రూంను వదిలిపెట్టలేదు. తిరిగి ఉదయం జాగరం గెడ్డవద్ద వర్షంనీరు రహదారిపైకి వచ్చిందని తెలుసుకుని అధికారులతో కలిసి వెళ్ళారు. అనంతరం భీమసింగిలో చాకిరేవు చెరువు కారణంగా రహదారులు, వరిపంటలు ముంపుకు గురయ్యాయని తెలుసుకుని వెంటనే వెళ్ళి పరిస్థితిలను గుర్తించి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. గ్రామంలోని రెల్లిపేట వాసులకు పునరవాసం ఏర్పాటు చేసారు. వారికి వసతితోపాటు భోజన ఏర్పాట్లు చేసి తగిన జాగ్రత్తలను తెలిపారు. ప్రత్యేకాధికారి కుమార స్వామి రెండు రోజులు అధికారులను పరుగులు పెట్టించి తానేంటో నిరూపించుకున్నారు. పరిస్తితి అంతా ఆధీనంలోకి రావడంతోపాటు ఎటువంటి ప్రాణ, ఆస్థి నష్టం లేకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు.

మండలంలో 188 హెక్టార్లులో వరిపంటకు నష్టం

వ్యవసాయశాఖ వెల్లడి

విశాలాంధ్ర-జామి: మండలంలో ఇప్పటి వరకు ప్రాథమిక పంట నష్టం సర్వే కింద 188 హెక్టర్లు అంచనా వేయడం జరిగిందని మండల వ్యవసాయాధికారిణి ఎం.పూర్ణిమ తెలిపారు. మొంథా తుఫాను కారణంగా ముంపుకు గురైన రామయ్యపాలెం, జామి, భీమసింగి గ్రామాలలోని వరి పంటలను బుధవారం ఏరువాక కేంద్రం, విజయనగరం శాస్త్రవేత్తలు డా.కె.లక్ష్మణ్, కె.ఎమ్.వి.వి. శ్రీనివాసరావులతో కలిసి పరిశీలన చేసారు. వీరితోపాటు రాష్ట్ర కొప్పుల వెలమ కార్పోరేషన్ డైరక్టర్ మాకిరెడ్డి శ్రీలక్ష్మి అధికారులతో ముంపు ప్రాంతాలను పరిశీలన చేసారు. నేలకు ఒరిగిన వరి చేలు పరిశీలించిన అనంతరం రైతులుకు ఇప్పటి వరకు ప్రాథమిక పంట నష్టం సర్వే కింద 188 హెక్టర్లు అంచనా వేయడం జరిగింది. పలు సూచనలు ఇవ్వడం జరిగింది. పడిన వరి చేలు కట్టలు కట్టుకొని 5శాతం 50 గ్రాములు 1 లీటర్ నీటిలో కలుపుకొని ఉప్పు ద్రావణం పనలు మీద పిచికారీ చేసుకోవడం వలన మొలకలు, రంగు మారకుండా ఉంటుందన్నారు. పాలు పోసుకునే దశలో ఉన్న వరిచేలు వర్షాలు వలన చేను పడిపోతే పొలంలో నీటిని అంతర్గత కాలువల ద్వారా తొలగించాలని సూచించారు. ఎక్కువగా నీరు నిలిచిన చోట పెద్ద కాలువలు చేసి మోటార్ల ద్వార నీటిని తొలగించాలన్నారు. అవకాశాన్ని బట్టిపడి పోయిన చేలు పైకి లేపి కట్టుకోవాలని, నిలబడి ఉన్న ,పడిపోయిన చేలలో గింజలు రంగు మారటం, మాగుడు తెగులు, మానిపండు తెగులు వ్యాప్తి నివారించడానికి ఎకరాకు 200 మి.లీ. ప్రోపికోనాజోల్ లేదా హేక్సకనాజోలు 400. మీ. లీ పి చికారీ చేయాలన్నారు. అలాగే రైతుల నష్టాన్ని అంచనావేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపించాలని మాకిరెడ్డి శ్రీలక్ష్మి వ్యవసాయాధికారులను కోరారు. ఈ కార్యక్రమం లో వ్యవసాయ అధికారి ఎమ్ పూర్ణిమతోపాటు ఏ ఈ ఓ షేక్ అహ్మద్, వి ఏ ఏ క్రిష్ణ, రైతులు పాల్గొవడం జరిగింది.

మానవత్వం చాటుకున్న టిడిపి క్లస్టర్ ఇంచార్జ్

విశాలాంధ్ర-దత్తిరాజేరు : మొంథ తుఫాన్ సందరరేగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇంచార్జ్ పెద్దింటి మోహన్ చేతుల మీదుగా బుధవారం కె కృషాపురం గ్రామంలో వరద బాధితులకు వాటర్ బాటిల్లు, కొవ్వొత్తులు,ఇంకా అవసరమైన సరుకులను పంపిణీ చేశారు. అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లొద్దని, సురక్షితమైన ప్రదేశంలో ఉండాలని వారికి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రామక ృష?,చంటి తదితరులు పాల్గొన్నారు.

కోటగండ్రేడు గ్రామంలో పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లు

విశాలాంధ్ర-గుర్ల: కోటగండ్రేడు గ్రామంలో గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు చేనేత కార్మికులు రామారావు, అప్పారావు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. మిద్దిల్లులు కూలిపోయేవి గ్రామంలో మట్టితో ఉన్న మిద్దిల ఇళ్ల పరిస్థితి కొంచెం ఇబ్బందిగానే ఉందని గ్రామస్తులు తెలిపారు.

గిరిజన గ్రామాల ప్రజలకు అండగా ఎమ్మెల్యే కోళ్ల

విశాలాంధ్ర-శృంగవరపుకోట రూరల్: శృంగవరపుకోట మండలం గిరిజన గ్రామాల్లో సుడిగాలి పర్యటనలు చేసిన ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి. పునరావాస శిబిరాల్లో ఉన్న చిన్నారులకు,మహిళలకు సొంత నిధులతో పాలు,పళ్లు, రొట్టెలు,చీరలు పంపిణీ చేసారు.ప్రజలు ఎవరు ఆందోళన చెందవద్దని అధైర్య పడవద్దని మీకు అండగా నేనున్నానని అన్నారు.మెట్టపాలెం, మూల బొడ్డవర,కాపుసోంపురం పునరావాస శిబిరాలను పరిశీలించారు.ప్రకృతి విపత్తు సమయాల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడటమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ముఖ్యంగా వ ృద్ధులకు, పిల్లలకు,గర్భిణీ స్త్రీల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు జీఎస్ నాయుడు,క్లస్టర్ ఇంచార్జ్ ఇందుకూరి శ్రీనివాసరాజు, గ్రామ పార్టీ అధ్యక్షులు ఆడారి సూరి అప్పారావు, యూనిట్ ఇంచార్జ్ క ృపారావు మరియు సచివాలయ సిబ్బంది, వైద్య శాఖ సిబ్బంది, కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కొత్త పెంట గ్రామంలో పాక్షికంగా దెబ్బతిన్న ఇంటిని పరిశీలించిన తహశీల్దార్ శ్రీను



విశాలాంధ్ర-బొబ్బిలి: మొంతా తుఫాను కారణంగా మండలంలో కొత్త పెంట గ్రామంలో పాక్షికంగా స్లాబ్ ఇల్లు పడిపోయిన సంఘటనపై గ్రామ రెవెన్యూ అధికారి సమాచారం మేరకు తహశీల్దార్ ఎం శ్రీను , రెవెన్యూ ఇన్స్పెక్టర్ కొల్లి రామ్ కుమార్ లు పరిశీలన చేశారు. మల్లంపేట ఏఈఈ ఎంఐ ట్యాంక్ వద్ద గతంలో గండిపడిన చెరువు గట్టు వద్ద ఇసుక బస్తాలతో గండిని కప్పివేశారు.

తుఫాన్ బాధిత మండలాల్లో స్పెషల్ ఆఫీసర్ సుడిగాలి పర్యటన

దెబ్బతిన్న రహదారులన్నీ వెంటనే పునరుద్ధరించాలని ఆదేశాలు

విశాలాంధ్ర-కొత్తవలస: జిల్లా ప్రత్యేకాధికారి రవి సుభాష్ పట్టంశెట్టి సంయుక్త కలెక్టర్ సేదు మాధవన్ తో కలసి బుధవారం తుఫాన్ బాధిత మండలాల్లో పర్యటించారు. జామి, ఎస్.కోట, ఎల్.కోట, కొత్తవలస, వేపాడ మండలాల్లో పర్యటించి తుఫాన్ నష్టాలను పరిశీలించారు. జామి మండలంలో భీమసింగి జంక్షన్ వద్ద ఆర్ అండ్‌బి రహదారిపై నీరు నిల్వ ఉండడం తో ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి నీరుతగ్గే మార్గంచూడాలన్నారు. ఎస్.కోటలో సంతగవిరమ్మ పేటలో పర్యటించి రహదారు లను పరిశీలించారు. ఎల్.కోట నుండి వేపాడ వెళ్లే మార్గంలో నున్న రైల్ అండర్ బ్రిడ్జ్ వద్ద నీరు నిల్వఉండడంతో సాయం త్రం లోగా నీరు తొడించాలని ఆదేశించారు. కొత్త వలసలో తహసీల్దార్ కార్యాల యంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ను సందర్శించారు. ఫిర్యాదులను ఎలా నమోదు చేస్తున్నారు, రెజిస్టర్లను ఎలా నిర్వహిస్తున్నారు అనే అంశాలను పరిశీలించారు. డ్యూటీ ప్రొసీడింగ్స్ తనిఖీ చేసి సిబ్బంది హాజరును తనిఖీ చేశారు. ప్రత్యేకాధికారి వెంట జెసి తో పాటు ఆయా మండలాల తహశీల్దార్లు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

నాగుపాము హల్‌చల్

విశాలాంధ్ర-మెంటాడ: రెండు రోజులుగా కురుస్తున్న మొంథా తుఫాన్ వర్షాల ప్రభావంతో మెంటాడ మండలం గుర్ల గ్రామానికి వెళ్లే దారిలో ఓ ఎలక్ట్రిక్ పోల్ విరిగి పడిపోయింది. దాంతో విద్యుత్ సరఫరా అంతరాయం కలగడంతో లైన్‌మెన్ బ ృందం పోల్ మార్చేందుకు బుధవారం ఉదయం అక్కడకు చేరుకుంది. పోల్ కోసం గుంత తవ్వుతున్న సమయంలో ఒక్కసారిగా నేల క్రిందనుండి ఆరు అడుగుల ఒక పెద్ద నాగుపాము పైకి లేస్తూ చుట్టుపక్కల దారి వెళ్తున్న ప్రజలను హల్‌చల్ చేసింది. ఆ అకస్మాత్తు ఘటనతో అక్కడ ఉన్న లైన్‌మెన్ భయంతో వెనక్కి తగ్గగా, సమీపంలో ఉన్న కొంతమంది రైతులు వెంటనే అక్కడికి చేరుకుని నాగుపామును హతమార్చారు. ఈ సంఘటనతో విద్యుత్ శాఖ సిబ్బంది, గ్రామ ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. వర్షాల కారణంగా నేల తడి పెరగడం వల్ల ఇలాంటి పాములు బయటకు వచ్చే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు.

తాగునీరు కలుషితం కాకుండా చూడాలి

నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య

విశాలాంధ్ర -విజయనగరం: తాగునీరు కలుషితం కాకుండా, రంగు మారిన నీరు సరఫరా కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య సిబ్బందికి ఆదేశించారు. తుఫాను అనంతరం కొత్తనీరు వచ్చి చేరే అవకాశం ఉందని, అలాగే కలుషిత నీరు మిళితం కావచ్చని, కావున నీటి పంపిణీ పట్ల సిబ్బంది ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. సచివాలయాల పరిధిలో ఆయా ఎమినిటీస్ కార్యదర్శులు ప్రతిరోజు క్లోరిన్ పరీక్షలు నిర్వహించాలన్నారు. దీంతో సిబ్బంది, కార్యదర్శులు క్లోరిన్ పరీక్షలను చేపట్టి నివేదికలు సమర్పిస్తున్నారు. ప్రతి 15 రోజులకు ఓసారి వాటర్ ట్యాంకులను పరిశుభ్రపరుస్తున్నారు. ప్రజలు కాచి చల్లార్చిన తాగునీటిని మాత్రమే వినియోగించుకోవాలని కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు.

ఈ ప్రాంతాలకు సరఫరా ఉండదు

కుదిపి,రామ తీర్థాలు పంపు హౌస్ దగ్గర ఇన్ ఫిల్ట్రేషన్ వెల్స్ ఎక్కువ వరద నీరు వచ్చి మునిగిపోవడం వలన రింగ్ రోడ్, కొత్తపేట యాత వీధి , కోలగట్ల వీధి, కోరాడ వీధి, చందాల వారి వీధి, లంక వీధి, సూర్యనగర్,తుపాకుల వీధి,వి టి అగ్రహారం, కొత్త అగ్రహారం, దక్కిన వీధి, బంగారం కాలనీ, నాగవంశం వీధి,కనపాక, బ్రాహ్మణ వీధి, పావని నగర్,కొండ వీధి, చందక వీధి, గొల్ల వీది, సాయి బాబా కాలనీ, శివాలయం, రోడ్, %రాజ% కాలనీ, చిన్న రెడ్డి కాలనీ మరియు చాకలవీధి, గంజి పేట, రెల్లి వీది , స్వీపర్ కాలనీ, అరుదంతి నగర్, కాంబో వీది, అలాగే అయ్యన్న పేట లకు రేపు నీటి పంపిణీ జరగదని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా ప్రాంత ప్రజలు సహకరించాలని కోరారు.

మొంతా తుఫాను లో నష్టపోయిన పంటలను పరిశీలించిన వ్యవసాయ అధికారి మజ్జ శ్యాంసుందర్

విశాలాంధ్ర-బొబ్బిలి : మొంతా తుఫాను కారణంగా వరి పత్తి పంటలకు నష్టం జరిగిన పలు ప్రాంతాల్లో మండల వ్యవసాయ అధికారి మజ్జ శ్యాంసుందర్ జగన్నాథపురం, క ృషా?పురం గ్రామాల్లో నీట మునిగిన పత్తి పంటలను, నేలకొరిగిన వరి పంటలను పరిశీలన చేశారు. జగన్నాథపురం గ్రామంలో రెండున్నర హెక్టార్లు వరి పంటకు నష్టం జరిగిందని, కృషాపురం గ్రామంలో ఒకటిన్నర హెక్టార్లు వరి పంటకు నష్టం వాటిలిందని, కాశిందరవలసలో ఒకటిన్నర ఎకరాల్లో పత్తి పంటకు నష్టం జరిగిందని, పారాది గ్రామంలో నాలుగు హెక్టార్లలో మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లినట్లు తెలిపారు.

ముందస్తు జాగ్రత్తలతో సత్ఫలితాలు



విశాలాంధ్ర-విజయనగరం: ముంథా తుఫానును సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు నగరపాలక సంస్థ అధికారులు చేపట్టిన ముందస్తు జాగ్రత్తలు సత్ఫలితాలనిచ్చాయి. గతంలో కొంచెం వర్షంకే న్యూ పూర్ణ జంక్షన్ పెద్ద చెరువు అవుట్ ఫ్లో, నాయుడు కాలనీ, పద్మావతి నగర్ తదితర ప్రాంతాలు వరద నీటితో నిండిపోయేవి. అయితే కమిషనర్ పల్లి నల్లనయ్య ఆలోచనలతో చేపట్టిన ముందస్తు జాగ్రత్తలతో ఆయా ప్రాంతాలు సాధారణ స్థితిలో ఉండడం గమనార్హం. ముఖ్యంగా పెద్ద చెరువు అవుట్ ఫ్లో ప్రాంతంలో లోవర్ ట్యాంక్ బండ్ రోడ్డుపై చేపట్టిన ప్రత్యేక ఏర్పాట్లు వల్ల అధిక మొత్తంలో నీరు రహదారిపై ప్రవహించకుండా అడ్డుకట్ట వేయడం జరిగింది. అలాగే ప్రధాన కాలువల్లో గుర్రపు డెక్క, తదితర చెత్తాచెదారాలను జెసిబిల సహాయంతో తొలగించడంతో వర్షపు నీరు సజావుగా ప్రవహించింది. అలాగే ప్రధాన కాలువల్లో ముందస్తు పూడికతీతలు చేపట్టడంతో ప్రస్తుతం కురిసిన వర్షాల వల్ల నీరు నిలవ లేకుండా సజావుగా ప్రవహించింది. గత కొద్దిరోజులుగా న్యూ పూర్ణ జంక్షన్ లో ఉన్న ప్రధాన కాలువలో చెత్తాచెదారాలు, పూడికలను జెసిబిల సహాయంతో తొలగించి వేశారు. దీనివల్ల ఆయా ప్రాంతంలో వర్షపునీరు ఎక్కువసేపు నిలవ లేకుండా త్వరగా ప్రవహించింది. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ తుఫాను సమయంలో ముందస్తు చర్యలు చేపట్టడం మంచి ఫలితాలను సాధించవచ్చునని అన్నారు. ముందస్తు ప్రణాళికలతో తాము చేపట్టిన విధానాల వల్ల ముంపు నివారణ చర్యలు చేపట్టినట్లు అయిందని అన్నారు. తుఫాను అనంతరం వర్షపు నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా కాలువల్లో చెత్త చెదరాలను తక్షణం తొలగించాలని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ప్రజారోగ్య సిబ్బందికి ఆదేశించారు. దీంతో బుధవారం ఉదయం నుండి జెసిబిలు, బాబ్ కార్ట్ లు సహాయంతో సిబ్బంది కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టారు. ప్రధాన కాలువలతో పాటు చిన్న చిన్న కాలువల్లో చెత్తాచెదారాలను తొలగిస్తున్నారు. దీంతో వర్షపు నీటి ప్రవాహానికి అడ్డంకులు తొలగి సజావుగా నీరు ప్రవహిస్తోంది. నీరు నిల్వ ఉన్న ప్రాంతాలలో ఆయిల్ బాల్స్, మిలాథీన్ పిచికారి చేపట్టాలని సిబ్బందికి ఆదేశించారు. దోమలు వృద్ధి కాకుండా నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. అయితే ప్రజలు కూడా మరింత చైతన్యవంతులై చెత్తాచెదారాలను, ప్లాస్టిక్ వస్తువులను, సామాగ్రిని కాలువల్లో వేయకుండా డస్ట్ బిన్లలో మాత్రమే వేయాలని చెప్పారు. దీనివల్ల వర్షాలు కురిసే సమయంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తవని సూచించారు.

ఎవరు అధైర్య పడవద్దు అండగా ఉంటాం

ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి

విశాలాంధ్ర -శృంగవరపుకోట: మొంథా తుఫాన్ సహాయక చర్యల్లో భాగంగా మండలంలో ఏర్పాటు చేసిన పునరావాస శిబిరంలో ఉన్న చిన్నారులకు,మహిళలకు పాలు, పళ్లు, రొట్టెలు, చీరలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి. ప్రజలు ఎవరు ఆందోళన చెందవద్దు అధైర్య పడవద్దు అండగా నేనుంటా అన్న ఎమ్మెల్యే తమ పట్ల చూపిన సేవా ద ృక్పథాన్ని మెచ్చుకున్న పాలవురు ప్రక ృతి విపత్తు సమయాల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడటమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. బుధవారం ఎస్.కోట మండలం పోతనాపల్లి, సంతగైరమ్మపేట గ్రామాల్లో తుఫాన్ సహాయక చర్యల్లో భాగంగా పునరావాస శిబిరాన్ని పర్యవేక్షించిన.అనంతరం సొంత నిధులతో పునరావాస కేంద్రంలో ఉన్న భాధితులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా పాలు, పళ్లు, బ్రేడ్స్,చీరలు పంపిణీ చేశారు, మూల బొడవర , మెట్టపాలెం పునరావాస శిబిరంలో ఉన్న చిన్నారులకు,మహిళలకు లో చీరలు, పళ్ళు రొట్టలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే లలిత కుమారి పునరావాస శిబిరంలో ఉన్న బాధితులతో మాట్లాడి వారికి అక్కడ అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. తుఫాన్ సహాయక చర్యలను స్వయంగా పరిశీలించారు. ప్రతి పునరావాస కేంద్రంలో వైద్యశాఖ సిబ్బంది అందుబాటులో ఉండాలని, ముఖ్యంగా వ ృద్ధులకు, పిల్లలకు, గర్భిణీ స్త్రీల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీపురం పెద్ద చెరువు ఉధృతిని పర్యవేక్షించిన సిఐ

విశాలాంధ్ర-చోడవరం : మండలంలోని లక్ష్మీపురం పెద్ద చెరువు ఉధృతిని స్టేషన్ సీఐ పి. అప్పలరాజు బుధవారం వర్యవేక్షించారు. సహాయక, రక్షణ చర్యల్లో భాగంగా పెద్ద చెరువు పరిసర ప్రాంతాలను వరిశీలించారు. గ్రామంలో నివసించే ప్రజలు, పర్యాటకులు చేపల వేటకు, నీటిని చూసేందుకు చెరువు చుట్టూ నిర్లక్ష్యంగా తిరగకూడదని గ్రామ పెద్దలకు సూచించారు. గ్రామ పెద్దలు పెద్ద చెరువుపై నిఘా ఉంచాలని, అవసరమైతే కబురు పంపాలని సిఐ వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐ అప్పలరాజుతోపాటు సర్పంచ్ ఆది గణపతి నాయుడు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పదేళ్లుగా అయ్యప్ప స్వామి భక్తులకు అన్న ప్రసాదం

విశాలాంధ్ర - యస్.రాయవరం : మండలంలోని తిమ్మాపురం గ్రామం లో పది సంవత్సరాలు అయ్యప్ప స్వామి మాలాధారణ భక్తులకు అన్న ప్రసాదమును పెట్టడం జరుగుతుంది 2015 సంవత్స రంలో అడ్డరోడ్డు తిమ్మాపురం ప్రాంతాల అయ్యప్ప సేవ సంఘం తరఫున మాలాధారణ చేసిన భక్తులకు దాతల సహకారంతో ఉచితంగా అన్న ప్రసాదమును పెడుతున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. సుమారు 300 మంది భక్తులు రావడం జరుగుతుందని వెల్లడించారు. బుధవారం భక్తులకు అన్న ప్రసాదం పెట్టిన దాతకు కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు .ఈ కార్యక్రమంలో కొరప్రోలు పిఎసిఎస్ చైర్ పర్సన్ గుర్రం రామకృష్ణ, జనసేన మండల అధ్యక్షుడు పప్పల శివ , కమిటీ సభ్యులు బదిరెడ్డి లోవరాజు పృథ్వీ, సూర్యం అశోక్ ,వాసు ,సత్తిబాబు

ప్రపంచ ఛాంపియన్ షిప్ కోచ్ హేమంత్ కు ఘన సన్మానం చేసిన వైసిపి నాయకులు

విశాలాంధ్ర-చీపురుపల్లి : బుధవారం చీపురుపల్లి జడ్పీటిసి కార్యాలయం ఆవరణలో చీపురుపల్లి పట్టణానికి చెందిన ఎయిర్ ఫోర్స్ ఉద్యోగి కంది హేమంత్ కు శాలువా కప్పి బొకే అందజేసి ఘనంగా సన్మానించారు. చీపురుపల్లి పేరును ప్రపంచ స్థాయిలో వినిపించేటట్లు చేసిన కంది హేమంత్ ను విజయనగరం జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎంపీపీ ప్రతినిధి ఇప్పిలి అనంతం, విజయనగరం జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రచారం విభాగ అధ్యక్షులు జడ్పీటిసి ప్రతినిధి వలిరెడ్డి శ్రీనువాస నాయుడు, చీపురుపల్లి మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మీసాల వరాహల నాయుడు తదితరులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫ్రాన్స్ లోని అల్బీలో ఈనెల 18, 19, తేదీలో జరిగిన 24 గంటల అల్ట్రా రన్నింగ్ ఛాంపియన్ షిప్ పోటీలకు భారతదేశం నుంచి వెళు ్తన్న అథ్లెటిక్స్ జూనియర్ కోచ్, క్రూ సభ్యునిగా ఎన్నికై ఇండియన్ అథ్లెటిక్స్ నకు పయనం అయ్యారు. గతడాది డిసెంబర్ లో ఇంటర్నేషనల్ ఆఫ్ అల్ట్రా రన్నర్స్, (ఐ ఏ యు) ఆధ్వర్యంలో బెంగళూరులో జరిగిన 100 కిలోమీటర్ అల్ట్రా రన్నింగ్ ప్రపంచ ఛాంపియన్షిప్ పోటీలకు కూడా హేమంత్ కోచ్ గా వ్యవహరించారు అన్నారు . నిత్యం ఫిట్ నెస్ వైపు శ్రద్ధ చూపించే హేమంత్ కు ఓవైపు ఎయిర్ పోర్స్ లో ఉద్యోగం చేస్తూనే మరోవైపు చీపురుపల్లి పరిసర ప్రాంతాలకు చెందిన యువతకు శారీరక దారుఢ్యం పై శిక్షణ ఇస్తూ, సాయుధ దళాలలో ఉద్యోగాలు సాధించేలా ప్రోత్సహిస్తున్నారు వారు కొనియాడారు . ఆయన కోచ్ గా ఎంపిక కావడంపై స్థానిక క్రీడాకారులు, ఉద్యోగస్తులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విజయనగరం జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మరియు ఎంపీపీ ప్రతినిధి ఇప్పిలి అనంతం, విజయనగరం జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రచారం విభాగ అధ్యక్షులు మరియు జడ్పీటిసి ప్రతినిధి వలిరెడ్డి శ్రీనువాస నాయుడు, చీపురుపల్లి మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మీసాల వరాహలనాయుడు, దన్నా న రాజీనాయుడు, స్కూల్ కమిటీ చైర్మన్ గవిడి సురేష్, రెడ్డి నీల, మీసాల సీతారాం, నూరు చిలకయ్య, ప్రభాత్ కుమార్, రాము, కంచుపల్లి అశోక్ డబ్బాడ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

తుఫాను దాటికి దెబ్బతిన్న 8 ఇళ్ళు, 12ఎకరాల వరిచేను, పిడుగుపాటుకు ఆవు మృతి

విశాలాంధ్ర-కొత్తవలస : మొంథా తుఫాను ప్రభావంతో 3రోజులుగా కురుస్తున్న వర్షాలకు గానూ కొత్తవలస మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రజలు పలు విధాలుగా నష్టాన్ని చవిచూశారు. అయితే రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం ముందస్తు చర్యలతో అప్రమత్తం చేయడంతో ప్రాణ నష్టం లేదని, కొన్ని గ్రామాల్లో కొద్దిపాటి ఆస్తి నష్టం వాటిల్లిందని కొత్తవలస మండల తహసీల్దార్ పి.అప్పలరాజు తెలిపారు. తుఫాను దాటికి ఆయా గ్రామాల్లో యంత్రాంగం పర్యటించి బుధవారం నాటికి ఆస్తి నష్టాన్ని గుర్తించినట్లు వివరించారు. కంటకాపల్లి పంచాయతీలో 6ఇళ్ళు, పెదరావుపల్లిలో 1, వీరభద్రపురంలో 1 ఇల్లు చొప్పున పాక్షికంగా దెబ్బతిన్నాయని, అలాగే ఎం.ఆర్.పురం గ్రామంలో పిడుగుపాటుకు పాడి ఆవు మ ృతిచెందగా, తుమ్మికాపల్లి, రెల్లి, గనిశెట్టిపాలెం, వీరభద్రపురం, చిన్నిపాలెం గ్రామాల్లో సుమారు 12ఎకరాల్లో వరిచేను వరదనీటి ముంపుకు గురైందని అధికారులు గుర్తించారని తహసీల్దార్ స్పష్టం చేశారు. అలాగే గులివిందాడ గ్రామంలోని వెంకన్నచెరువుకు గండి పడటంతో తహసీల్దార్ అప్పలరాజు వెనువెంటనే సహాయక చర్యలు చేపట్టారు.

జేసిబి సహాయంతో చెరువు గండిని పూడ్చి సంరక్షించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే సాంబయ్యపాలెంలో విద్యుత్ లైన్ పై తాటిచెట్టు కూలిపోవడంతో విద్యుత్ శాఖ ఏఈ సూరిబాబు తక్షణ చర్యలు చేపట్టి సిబ్బందించే విద్యుత్ లైన్ పునరుద్ధరణ పనులు చేపట్టారు. రామలింగపురం వద్ద సుమారు 10విద్యుత్ స్తంభాలు తుఫాను దాటికి ఓవైపుగా వరిగిపోయి ప్రమాధకరంగా మారడంతో వాటిని సిబ్బంది సహాయంతో సరిచేసి లైన్ పునరుద్ధరణ చేశారు. మండలంలోని 25పంచాయతీ గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, మెరుగైన తాగునీరు అందించడంపై పంచాయతీ కార్యదర్సులను ఆదేశించినట్లు ఎంపీడిఓ పి.రమణయ్య తెలిపారు.

మండల పరిషత్ పాఠశాల ఆవరణలో జనసైనికులు శ్రమదానం

విశాలాంధ్ర-సబ్బవరం: మండలం లోని రాయపురఅగ్రహారం గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో బుధవారం పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు పిలుపుమేరకు రాయపురఅగ్రహారం జనసేన పార్టీ అధ్యక్షులు పిల్లల అప్పలనాయుడు ఆధ్వర్యంలో జన సైనికులు పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలు తొలగించి చెత్తను ఎత్తివేసి శుభ్రం చేశారు. మొంతా తుఫాన్ సైతం లెక్కచేయకుండా జన సైనికులు శ్రమదానం చేశారు.అలాగే డ్రైనేజీ లలో పేరుకుపోయిన చెత్త ను తొలగించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జనసైనికులు, యూత్ సభ్యులు, వీర మహిళలు పాల్గొన్నారు.